Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.03.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 41 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



• ఖరారైన పోలింగ్

# ఎవరో కింగ్?

తొలిదశలోనే ఏపిలో ఎన్నికలు | వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు | రోజురోజుకీ మారుతున్న సమీకరణలు | ఓట్ల వేటలో పార్టీలు

**దేశ వ్యాప్తంగా ఎన్నికల యుద్ధభేరీలు మోగాయి. పార్టీల అధినేతలు సర్వసైన్యాధ్యక్షులై తమ సేనలను ముందుకు నడిపిస్తున్నారు. ఎన్నికల సమరాంగణంలో అధికారమో, ప్రతిపక్షమో తేలిపోతుంది. దేశానికి, ఆయా రాష్ట్రాలకు ఐదేళ్ళ పాటు రాజులెవరో, రాళ్ళే సేవాళ్లెవరో బయటపడుతుంది.**

భారతదేశ పార్లమెంట్ వ్యవస్థకు కేంద్ర ఎన్నికల సంఘం ఏడు దశలలో ఎన్నికలు నిర్ణయించగా, మొదటి దశలోనే ఏపిలో ఎన్నికలొచ్చాయి. ఏప్రిల్ 11వ తేదీన ఏపిలో 25 లోక్‌సభ స్థానాలకు, 175 శాసనసభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మే23వ తేదీన కౌంటింగ్... అంటే ఫలితాల కోసం ఆంధ్రప్రదేశ్ నాయకులు, ప్రజలు 42రోజుల పాటు వేచిచూడాలి!

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య నువ్వా – నేనా అన్నట్లుగా వుంది. రాష్ట్రంలో ఎన్నికలు ఈ రెండు పార్టీలకు కూడా ఫైనల్ మ్యాచ్ లాంటివే! ఈ ఎన్నికలలో ఏ పార్టీ ఓడిపోయినా ఇక సీన్‌లో ఉండకపోవచ్చు. తెలుగుదేశం అన్నది నిలబడాలంటే మళ్ళీ గెలవాలి. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ ఎన్నికలు చాలా కీలకం. ఆయన తన రాజకీయ వారసుడిగా లోకేష్‌ను ప్రమోట్ చేయడానికి ఈ ఎన్నికలలో గెలవాలి. ఈ ఎన్నికల్లో ఓడిపోవడం అంటూ జరిగితే అది లోకేష్ రాజకీయ భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. చంద్రబాబుకు వయసు పైనపడుతుంది. లోకేష్‌కు సొంతంగా పార్టీని నడిపించేంత శక్తి సామర్థ్యాలు లేవు. చంద్రబాబు సీన్‌లో వున్నప్పుడే లోకేష్‌కు పట్టాభిషేకం జరిగిపోవాలి. తాను యాక్టివ్‌గా వున్నప్పుడే (మిగతా 11వ పేజీలో)



యువనేతకు...

# తెలుగు యువత

• యువ సేవకుడికి సరైన బాధ్యత

కీలకమైన సమయాలలో సరైన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించడం అన్నది నాయకత్వ లక్షణం. జిల్లా తెలుగుదేశం పార్టీలో అలాంటి ప్రక్రియే జరిగింది. నెల్లూరుజిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా చిన్నవయసులోనే సామాజిక సేవా కార్యక్రమాలతో జిల్లా ప్రజలకు సుపరిచితుడైన మాగుంట శరత్‌చంద్రారెడ్డిని నియమిస్తూ (మిగతా10వ పేజీలో)



• ముసుగు తొలిగింది!

జేమ్స్‌బాండ్ కాదు...

# నారా బ్రాండ్?

**సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ... నిన్నటివరకు ఆయన కనిపించని నాలుగో సింహం. అవినీతిపరుల పాలిట సింహస్వప్నం. అన్యాయాలను సహించడు... తప్పు చేసినోడు తనోడైనా పరాయివాడైనా తుప్పు వదిలిస్తాడు... ఇదీ రాష్ట్ర ప్రజల్లో ఆయన పట్ల వున్న అభిప్రాయం.**

బహుశా ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై పలు ఆస్తులకు సంబంధించిన కేసులు నమోదు చేయడం, సంబంధం లేని చట్టాలు ఛార్జిషీట్లలో పెట్టి జగన్‌ను జైలుకు పంపించడం వంటివి కూడా ఓ వర్గం ప్రజల్లో ఆయనపై అభిమానాన్ని పెంచాయి. వైసిపి అభిమానులు, కార్యకర్తలు మాత్రం తొలినుండి నెత్తి నోరు కొట్టుకుంటున్నారు... ఆయన అవినీతిపరుల పాలిట సింహస్వప్నం కాదని, ప్రభుత్వం దగ్గర జీతం తీసుకుంటూ చంద్రబాబుకు ఊడిగం చేసే కట్టుబానిస అని. జగన్ మీద కేసుల విచారణకేమో బయట రాష్ట్రాల నుండి సిబ్బందిని పిలిపించుకున్న ఆయన, చంద్రబాబుపై కేసు విచారణ వద్దకొచ్చేసరికి తన వద్ద తగినంతమంది సిబ్బంది లేరని చేతులెత్తేసాడు. అప్పుడే చాలామంది గమనించారు ఇతను బాబుకు కట్టప్పలాంటోడని. జె.డి లక్ష్మీనారాయణ చంద్రబాబు పట్ల (మిగతా 11వ పేజీలో)



# టిడిపికి టాటా చెప్పిన పెళ్ళకూరు



కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశాడు. తెలుగుదేశంలో ఇన్నేళ్ళు కష్టపడ్డా సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వలేదనే బాధతోనే ఆయన పార్టీని వీడాడు.

2009లో కోవూరులో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీని వదిలి కాంగ్రెస్‌కు మద్దతుగా వెళ్ళాడు. 2012 ఉపఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశంకు అభ్యర్థే లేకపోతే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోటీ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ఇక్కడ టిడిపి కేడర్‌కు దిక్కయ్యాడు. అయితే 2014 ఎన్నికల్లో పెళ్ళకూరును కాదని కాంగ్రెస్ నుండి వచ్చిన పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి సీటిచ్చారు. అయితే పెళ్ళకూరుకు ప్రత్యామ్నాయంగా ఈ ఐదేళ్ళలో ఏ పదవీ ఇవ్వలేదు. ఇప్పుడు ఎన్నికల్లో మళ్ళీ ఆయన కోవూరు సీటు అడిగాడు. పార్టీ నాయకత్వం ఆయన పేరును కోవూరు, నెల్లూరురూరల్‌తో పాటు నెల్లూరు లోక్‌సభకు కూడా పరిశీలనలో పెట్టారు. అయితే చివరకు ఎక్కడా సీటు రాలేదు. తెలుగుదేశంలో వుంటే ఇంకెంత కాలమైనా ఇలాగే వుంటామని భావించిన ఆయన తెలుగుదేశంకు రాజీనామా పడేసి వైసిపిలో జాయినయ్యాడు.

## ఆదాలకు మద్దతుగా..

# ఆర్‌ఎస్‌ఆర్ విస్తృత ప్రచారం



ఆదాలకు మద్దతుగా ఇంటింటికి ప్రచారం చేస్తున్న ఆర్‌ఎస్‌ఆర్

నెల్లూరు నగరం కొండాయపాలెం, వనంతోపు, నక్కలగుంట ప్రాంతాల్లో మంచి పరిచయాలు కలిగి, గట్టి పట్టున్న నాయకుడు రాయపు శ్రీనివాసరావు(ఆర్‌ఎస్‌ఆర్) ఈ ఎన్నికల్లో నెల్లూరురూరల్ అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదాల వ్యక్తిత్వాన్ని, ఆయన చేసిన మంచి పనులను ఇంటింటికి తిరిగి వివరిస్తూ 18వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయన వెంట దారా మల్లిఖార్జున్, రూపేష్, నెల్లూరు శీనయ్య, చెన్నమ్మ, సుభాషిణి, సుబ్బలక్ష్మి, లాజరమ్మ, గిరి, వెంకటేష్, రంజిత్, దయాకర్, మస్తాన్, పవన్, నవీన్, శ్రావణ్, రాజేష్, రాకేష్, మనోజ్, దారా సుబ్బయ్య, పాలిష్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'దేశం'తో..

# అనుబంధాన్ని వదులుకున్న 'బల్లి'



జిల్లా తెలుగుదేశంపార్టీలో 1983 బ్యాచ్ నాయకుల్లో గూడూరు మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావు ఒకడు. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో స్థిరమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. పార్టీలో చంద్రబాబుకంటే కూడా సీనియర్. ఇలాంటి నాయకుడు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశాడు. గూడూరు టిక్కెట్ ఈసారి కూడా ఆయనకు రాకపోవడంతో ఇక ఆ పార్టీలో ఉండలేక రాజీనామా లేఖ పంపాడు. బల్లి 1983 నుండి పార్టీలో వున్నాడు. 1983, 1985, 1989, 1994, 1999, 2009 ఎన్నికల్లో గూడూరు రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేశాడు. 4 దఫాలు ఎమ్మెల్యేగా విజయం సాధించడమే కాకుండా ఒకసారి మంత్రిగా కూడా పనిచేశారు. 2004, 2014లలో ఆయనకు సీటు రాలేదు. ఈసారి గూడూరు సీటును పాశం సునీల్‌కు కేటాయించడంతో ఇక అక్కడ తనకు స్థానం లేదనుకుని తెలుగుదేశంతో వున్న తన సుదీర్ఘ బంధాన్ని తెంచుకున్నాడు.

# ఇది ధనంకు జనంకు మధ్య జరిగే పోరాటం

## • ప్రచారాన్ని ప్రారంభించిన అనిల్

తన విద్యాసంస్థల్లో ఏ ఒక్కరికైనా విద్యను, వైద్యసంస్థల్లో ఎవరికైనా వైద్యాన్ని ఉచితంగా అందించని నారాయణ ఇప్పుడు ప్రజాసేవ అంటూ రావడం ఎంతో హాస్యాస్పదంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. బుధవారం నగరంలోని 3వ డివిజన్ వేణుగోపాలస్వామినగర్ నుంచి ఎమ్మెల్యే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, నారాయణ విద్యాసంస్థల్లో మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్ళి ఏనాడూ ఆయన కనీసం వారిని పరామర్శించిన దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు. మంత్రిగా నారాయణ చేరినప్పటినుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప నగర ప్రజలకు చేసిందేమీ లేదని, మీ ఇళ్ళ వద్దకు ఏనాడైనా మంత్రి నారాయణ వచ్చి మీ సమస్యలు పరిష్కరించాడా?..అని ఆయన ప్రశ్నించారు. నెల్లూరునగరంలో ఒక సామాన్యుడికి-ధనవంతుడికి మధ్య పోటీ జరుగుతున్నదని అంటూ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి సిఎం కానున్నారని ధీమా



వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం జగన్ 'నవరత్నాల' పథకాలకు శ్రీకారం చుట్టారని, అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమకార్యక్రమాలను చేపట్టనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో తనను ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌ను ప్రజలు స్వాగతించి నీరాజనాలు పలికారు. అనేకచోట్ల మహిళలు అనిల్‌ను దీవిస్తూ హారతులిచ్చి ఆశీర్వదించారు.

సింహపురి సమాచారం

# నెల్లూరులోని నకిలీ రెయిన్‌బో హాస్పిటల్‌కి నోటీసులు

హైదరాబాద్‌లో పురుడు పోసుకుని దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ తమ బ్రాండ్‌ను వాడుకుంటున్నారంటూ నెల్లూరులోని కిడ్స్ రెయిన్‌బో చిల్డ్రన్ & బేబీ హాస్పిటల్ వారిపై కేసు పెట్టి నోటీసులు అందించారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఇప్పటివరకు ఎన్నో అవార్డులను తమ కైవసం చేసుకున్న రెయిన్‌బో హాస్పిటల్స్ దేశ వ్యాప్తంగా ప్రముఖంగా వున్న తమ సంస్థ పేరును నెల్లూరులోని డాక్టర్లు వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై కేసు రిజిష్టర్ చేసుకున్న పోలీసు శాఖ నెల్లూరులోని రెయిన్‌బో వారి బిల్లు పుస్తకాలను, కంప్యూటర్లను, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్స్‌తో పాటు రెయిన్‌బో పేరుతో వున్న అన్ని డాక్యుమెంట్లను సీజ్ చేశారు. నెల్లూరులోని హాస్పిటల్ భాగస్తులకు నోటీసులు ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కోటంరెడ్డిది చీకటి పోరాటం

## ➢ ఆనం వెంకటరమణారెడ్డి ఎద్దేవా

ఆనం వెంకటరమణారెడ్డి... 40ఏళ్ళ రాజకీయ చరిత్రను కలిగిన స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డికే ముచ్చెమటలు పట్టించిన నాయకుడు. 2009 ఎన్నికలలో నెల్లూరు రూరల్ నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన కేవలం వై.యస్. సానుభూతి గాలిలో 3,131 ఓట్ల తేడాతోనే ఓడిపోయాడు. ఆ ఎన్నికల్లో ఆనం వివేకాను ఓడించినంత పని చేశాడు. గత ఐదేళ్ళుగా జిల్లా రాజకీయాలకు దూరంగా వున్న ఆనం వెంకటరమణారెడ్డి మళ్ళీ రీ ఎంట్రీ ఇచ్చాడు.

ఈసారి నెల్లూరురూరల్‌లో తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం కంకణం కట్టుకుని రంగంలోకి దిగాడు. ఆనం కుటుంబ రాజకీయాలను వంట బట్టించుకున్న వెంకటరమణారెడ్డి తనదైన శైలిలోనే ప్రత్యర్థులపై విరుచుకు పడుతున్నాడు.

ఈ నెల 13న నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ నిజాలు చెప్పని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాను అరెస్టయి విడుదలైన తర్వాత విలేకర్లతో నిజాలు వెల్లడించారని, 5మంది కోటీశ్వరులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

ఆయనకు టిక్కెట్ రాకుండా జగన్ వద్దకు వెళ్ళి ఫిర్యాదు చేశారని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. టిడిపి నాయకులకు జగన్ వద్దకు వెళ్లేంత చొరవ, సాన్నిహిత్యం లేదని, వైయస్సార్‌సిపి వారికే అంత చొరవ వుందన్నారు. ఆయన చెప్తున్న కోటీశ్వరులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు అయి ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ అయిదు మంది నగరంలో 60మంది హంతకులు, రౌడీషీటర్లను దించారని సాక్షాత్తు ఎమ్మెల్యే కోటంరెడ్డి చెప్పారన్నారు. ఈ విషయం తెలిసి ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. పోలీసులు శ్రీధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని వచ్చిన 60మంది హంతకులు, రౌడీషీటర్ల వివరాలను నిగ్గు తేల్చాలంటూ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేస్తున్నాడు. భూకబ్జాలపై పోరాడానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పుకుంటున్నాడని, ఆయన అటువంటి పోరాటాలు చేసిన చరిత్ర తనకు తెలియదని, ఎందుకంటే అటువంటి కార్యక్రమాలు చీకటిపడిన తర్వాతే జరుగుతాయని, బహుశా అటువంటివేమన్నా వుంటే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చీకట్లో చేసి వుండొచ్చంటూ వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశాడు. ఒక బాధ్యతాయుతమైన ఎమ్మెల్యేగా నెల్లూరుకు రౌడీలను ఎవరు తీసుకొచ్చారో ఆయన పోలీసులకు వెల్లడించాలని రమణారెడ్డి డిమాండ్ చేశాడు. వైసిపిలో ఉన్న అంతర్గత పోరుకు నెల్లూరు ప్రజలను బలి చేయొద్దని ఆయన శ్రీధర్‌రెడ్డిని కోరాడు. ఎప్పుడూ నిజాలు మాట్లాడని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ ఒక్క విషయంలో మాత్రం నిజాలు చెప్పాడంటూ అభినందించాడు.

# శారదాకుమార్‌కు కీర్తి పురస్కారం

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆధ్యాత్మికవేత్త శారదాకుమార్(శివరాజు వెంకట నరసింహారావు)కు తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల 'కీర్తి పురస్కారం' ప్రకటించింది. ఈ సందర్భంగా నెల్లూరులోని పలువురు కవులు, సాహితీవేత్తలు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

• అరెస్ట్ పర్వం

# అమాయకుడు శ్రీధర్

తన సహచర ఎమ్మెల్యేలని చేతగాని నా కొడుకులని, 5వ టౌన్ సి.ఐని అధికార పార్టీ తొత్తు అని, బ్రోకర్ అని అన్నాడు తప్పితే అంతకుమించి ఏ పాపం ఎరుగడు.

## ఊత పదాలు వాడి ఊచలు లెక్కపెట్టాడు



ఇటీవల జరిగిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ అరెస్టు ఇటు జిల్లాలోను, అటు రాష్ట్రంలోనూ చర్చ నీయాంశమైయ్యింది. శ్రీధర్‌ని ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందో ఎక్కువమందికి తెలియకపోయినా, ఆయనే తన పి.ఏ ద్వారా తీయించుకుని సోషల్ మీడియాలో పెట్టుకున్న వీడియో చూసినవారికి మాత్రం నిజం తెలిసి పోయింది. తాను తమ కార్యకర్తలను విడిపించమని ప్రాధేయ పడడానికి 5వనగర పోలీసుస్టేషన్‌కు వెళ్లానని, చాలా మర్యాదగా సి.ఐ గారితో మాట్లాడానని శ్రీధర్ చెప్తున్నాడు. శ్రీధర్ అరెస్ట్ తర్వాత ఆయన కుటుంబసభ్యులు పెట్టిన ప్రెస్‌మీట్‌లో కూడా తమ తండ్రి అమాయకుడని సి.ఐని కాని, వేరెవరిని కాని పల్లెత్తు మాట అనలేదని, ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుట్ర చేసి తన తండ్రిని ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీధర్ స్వయంగా షూట్ చేయించి విడుదల చేసిన పోలీస్‌స్టేషన్ "కథ"లో అసలు ఆయనేం మాట్లాడాడో గమనిస్తే....!

- యాజ్ యం.యల్.ఏగా నేనడుగుతున్నా మావాళ్ళను అరెస్టు చేసినట్లు నాకు చూపించు.
- మీ డి.జి కన్నా, సి.యస్. కన్నా, యస్.పి. కన్నా పెద్ద ప్రోటోకాల్ నాది.
- మెత్తగా మాట్లాడుతున్నానని నీ ఇష్టం అనుకున్నావా.
- నేను స్టేషన్‌లోనే పడుకుంటా, నీ ఇష్టమొచ్చిన కేసులు పెట్టుకో నాకభ్యంతరం లేదు.
- నువ్వేం చెప్పావు నాకు నిన్న సాయంత్రం... 9గంటలకు కోర్టుకు పెడ్తానన్నావు. ఏం నేనేం చాతగానివాడిననుకున్నావా, నేను తేల్చుకుంటా, మీ ఎస్పీగారిని రమ్మను, మీ డి.జి గారిని రమ్మను, మీ డియస్‌పిని రమ్మను, నేను స్టేషన్‌లోనే పడుకుంటా.
- దుర్మార్గంగా మా ఓట్లు తొలగిస్తుంటే, మా కార్యకర్తలు కంప్లయింట్ చేస్తే నీకు దమ్ము లేదు కేసులు రిజిష్టర్ చేయడానికి, మావాళ్ళ మీద కేసులు పెడ్తావా...?
- రేయ్ ఆనంద్ నువ్వు కేసు పెట్టు, సి.ఐ నిన్ను కులం పేరుతో తిట్టాడని కేసుపెట్టు, మేజిస్ట్రేట్ ముందు కేసు పెట్టు అంటూ సి.ఐనుద్దేశించి దళితులంటే లెక్కలేదా నీకు అని ప్రశ్నించాడు.
- స్టేషన్‌లో ఎక్కువ మంది శ్రీధర్ అనుయాయులు వుండ డంతో వాళ్ళనంతా బయటకు వెళ్లాల్సిందిగా సి.ఐ కోరాడు. అయితే వాళ్ళెవరూ బయటకి పోరు నీకు చేతనైంది చేసుకో అంటూ దురుసుగా మాట్లాడాడు.
- పద్ధతిగా ఉంటే పద్ధతిగా వుంటా, చూస్తా సి.ఐ గారూ, చేతగాని నా కొడుకులుంటారు, చేతగానోళ్ళు యం.యల్.ఏలు వాళ్ళతో పెట్టుకోండి, నాతో ఏంది పెట్టుకునేది.
- విష్ణు మొత్తం రికార్డు చేసుకో, నేను మాట్లాడే ప్రతీ మాట ఎలక్షన్ కమిషన్‌కి పోవాల, కోర్టుకి పోవాలి, కోర్టంటే మాకు గౌరవముంది అంటూ సి.ఐ వైపు చేయి చూపిస్తూ వీళ్ళే సుప్రీం కాదు, అధికార పార్టీ ఏజెంట్లు లాగా పనిచేస్తున్నారు వీళ్ళు.
- అందరూ కాదులే... ఓన్లీ సి.ఐ నరశింహారావు అని మూడుసార్లు అని... ఆయనను అధికారపార్టీ ఏజెంట్ అన్నాడు.
- చూస్తా మొత్తం అందరిని చూస్తా ఏం చేతగానివాడి ననుకున్నారా, రేపు నోటిఫికేషన్ వస్తోంది చూస్తా మీ సంగతి.

### బయటకు వెళ్ళిన తరువాత చేసిన నినాదాలు...

- బ్రోకర్, బ్రోకర్, సి.ఐవా నువ్వు బ్రోకర్‌వా... నీ స్టేషన్ ముందు మాట్లాడతుండా... బ్రోకర్. సి.ఐవా నువ్వు బ్రోకర్‌వా. అధికార పార్టీ ఏజెంటువా. కంప్లైయింట్ చేస్తా ఎలక్షన్ కమిషన్‌కి ఫైవ్‌టౌన్ సి.ఐ నరసింహారావు ఒన్‌సైడ్ చేస్తున్నాడు, అధికార పార్టీ ఏజెంట్‌లాగా పనిచేస్తున్నాడు. ఫైవ్ టౌన్ సి.ఐ నరసింహారావు అధికారపార్టీ తొత్తు.
- రమ్మను ఎవరొస్తారో... ఫైవ్ టౌన్ నరసింహారావు డౌన్ డౌన్, అధికారపార్టీ ఏజెంట్ నరసింహారావు డౌన్‌డౌన్... అధికార పార్టీ తొత్తు నరసింహారావు డౌన్‌డౌన్. రమ్మను ఎవరొస్తారో... యం.యల్.ఎ ని ఇన్సల్ట్ చేస్తావా నువ్వు.
- మా కార్యకర్తలని ఇష్టమొచ్చినట్లు తిడతావా? చేతగా నోళ్ళమా మేమైనా. విష్ణు మొత్తం రికార్డు చెయ్యి. ఫైవ్‌టౌన్ సి.ఐ సంగతి జనానికి తెలియాలి. ఇదేమన్నా డెమాక్రసీయా... నియంతృత్వమా...?

ఇలా తాను తరచూ వాడే ఊతపదాలను ఉచ్ఛరించాడు తప్పితే అంతకుమించి ఏం లేదు. దశాబ్దాల తరబడి తన బాగు కోసం తన భవిష్యత్ కోసం సహాయపడినోళ్ళను సైతం ఆయన "బ్రోకర్ నా కొడుకు" అనే పిలుస్తాడు. బ్రోకర్, నా కొడుకులు, తొత్తులు, అంతుచూస్తా, నీ సంగతి తేలుస్తాతో పాటు పత్రికల్లో రాయలేని పదజాలాన్ని ఆయన ఇటీవల తరచూ ఎక్కువుగా వాడుతున్నాడు. అది ఆయనకి చాలా మామూలు విషయం. పాపం... ఇవన్నీ ఆయన ఊతపదాలని తెలియని పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. చూద్దాం! రూరల్ ఓటర్లన్నా ఆయన్ను అర్థం చేసుకుంటారేమో...?

# అభివృద్ధికి చిరునామా అంటే నేనే...

• ఎన్నికల ప్రచారంలో ఆదాల



అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ అంటే ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనేంతగా తాను గెలిచిన ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు చేశానని నెల్లూరురూరల్ నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నాడు. గతవారం రోజుల్లో ఆయన రూరల్ నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాలు, నగర పరిధి లోని డివిజన్‌లలో విస్తృతంగా ప్రచారం నిర్వ హించారు. పలుచోట్ల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తెలుగుదేశంలో చేరగా ప్రభాకర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆదాల మాట్లాడుతూ నేను గతంలో అల్లూరు నుండి ఒకసారి, సర్వేపల్లి నుండి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను, అక్కడ అభివృద్ధి చేశాను తప్పితే అవినీతి చేయలేదు. అక్కడి ప్రజల అభిమానం పొందాను తప్పితే అసహ్యించుకునేలా నడుచుకోలేదు. 2014లో నెల్లూరు లోక్‌సభ నుండి ఓడిపోయినా నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా 2,500కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశాను. అర్హత ఉన్నోళ్ళందరికీ ఇళ్ళు ఇప్పించాను. ప్రతివీధిలో సిమెంట్‌రోడ్డు వేయించాను. నాకు తెలిసిందల్లా వున్నది వున్నట్లు మాట్లాడడం. ప్రజలకు కావాల్సింది చేయడం. నాకు రౌడీ రాజకీయాలు తెలియవు. పోలీస్‌స్టేషన్‌లకు వెళ్ళి దౌర్జన్యం చేయడం తెలీదు. నాటకాలు చేతకాదు, కేవలం మీరు ఓట్లేసి గెలిపిస్తే మీ సేవకుడిగా పని చేయడం మాత్రమే తెలుసని ఆయన చెప్పుకుంటున్నాడు.



మహిళలను పార్టీ కండువాలు కప్పి తెదేపాలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# సైకిల్ దిగిన మాగుంట

- ఎమ్మెల్సీ పదవికి, తెదేపాకి రాజీనామా
- ఒంగోలు వైసిపి అభ్యర్థిగా బరిలోకి

శాసనమండలి సభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. దీంతో కొద్ది రోజులుగా తన రాజకీయ భవిష్యత్ నిర్ణయంపై జరుగుతున్న చర్చలకు తెరదించారు. 16వ తేదీన జగన్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరి ఒంగోలు లోక్‌సభ స్థానం నుండి పోటీ చేయనున్నారు. దీంతో మాగుంట తెలుగుదేశంలో ప్రయాణం ఐదేళ్లకే ముగిసినట్లయ్యింది.

నెల్లూరులో మూడుహాలోళ్ళుగా పేరుబడ్డ స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 1991లో హఠాత్తుగా రాజకీయాల్లోకి వచ్చాడు. ఒంగోలు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయ సాధించారు. ఎంపి అంటే ఏమేం చేయొచ్చో, ప్రజల గుండెల్లో ఎలా నిలిచిపోవచ్చో చూపించారు. విద్యాదాతగా, మంచినీటి ప్రదాతగా ప్రకాశం జిల్లా ప్రజల గుండెల్లో సుబ్బరామరెడ్డి దేవుడయ్యాడు. అలాంటి నాయకుడిని 1995 డిసెంబర్ 1వ తేదీన నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారు. ఆయన రాజకీయ వారసత్వంతో ఆయన సతీమణి మాగుంట పార్వతమ్మ రాజకీయాల్లోకి వచ్చారు. 1996లో ఒంగోలు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె విజయం సాధించారు. 1998లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల ద్వారా మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు తెరమీదకు వచ్చారు. 1998 ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా గెలిచిన ఆయన, 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో వాజ్‌పేయి సానుభూతి మూలంగా ఓడిపోయారు. మళ్ళీ 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా చచ్చుబడిపోవడంతో అప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా తెలుగుదేశంలో చేరి, ఒంగోలు లోక్‌సభకు ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత తెలుగుదేశం అధికారంలోకి రావడంతో ఆయనను తర్వాత ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించారు.

అయితే తెలుగుదేశంలో వున్నాడనేగాని ఆయన అనుచరులు, అభిమానులు ఆ పార్టీలో ఇమడలేకపోయారు. వారి మనసంతా కూడా వైసిపివైపే లాగేది. మాగుంట కూడా వారి మనసులను అర్థం చేసుకుని సైకిల్ దిగి ఫ్యాన్ క్రిందకు చేరాడు.



### ప్రకాశం ప్రజలను మరువలేం...

ఈ నెల 14వ తేదీన ఒంగోలులోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాగుంట శ్రీనివాసులురెడ్డి తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అలాగే వైసిపిలో చేరుతున్నట్లు కూడా ప్రకటించ డంతో అక్కడే భారీసంఖ్యలో ఉన్న ఆయన అనుచరులు పెద్దఎత్తున హర్ష ధ్వానాలు చేశారు. అయితే, టిడిపికి రాజీనామా చేస్తూ కూడా మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆ పార్టీపైగాని, ఆ పార్టీ అధినేత చంద్రబాబుపై గాని ఎటువంటి ఆరోపణలు, విమర్శలు చేయలేదు. అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. ఒకనాడు ఆదరించిన కాంగ్రెస్ పార్టీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతో పాటు 2014లో తనకు సీటు ఇచ్చిన తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వై.యస్. కుటుంబంతో ఉన్న అనుబంధం దృష్ట్యా తన అనుచరులు, అభిమానుల మనోభీష్టం మేరకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నట్లు, ఒంగోలు నుండే ఎంపీగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. తమను ఎంతో కాలంగా ఆదరిస్తున్న ప్రకాశం జిల్లా ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోనన్నారు.

## 'ప్రభా'తం

# మోగిన నగారా!



**తొలివిడతలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాలలో ఒకేసారి ఎన్నికలు పెట్టడం వల్ల డబుల్ ఓటు సమస్యను అధిగమించే అవకాశ ముంది. సీమాంధ్రులు చాలామంది హైదరాబాద్ మరియు కొన్ని తెలంగాణ పట్టణాల్లో ఓటు హక్కును కలిగి వుండడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తమ సొంత గ్రామాలలో కూడా ఓట్లు కలిగి వున్నారు. రెండుచోట్లా ఒకేరోజు ఎలక్షన్‌తో ఈ సమస్యను చాలావరకు ఎదుర్కొన్నట్లే!**

ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల వ్యవస్థ భారతదేశంలో వుంది. ఈ దేశంలో ఎన్నికలంటే ఆషామాషీ విషయం కాదు. ప్రపంచ దేశాలకే ఆదర్శవంతమైన ఎన్నికల వ్యవస్థ మనది. దాదాపు 82కోట్ల మంది ఓటర్లు... 29 రాష్ట్రాలు... 7 కేంద్రపాలిత ప్రాంతాలు... 543 లోక్‌సభ నియోజకవర్గాలు.... ఇంతటి సువిశాల దేశంలో ఇన్ని కోట్ల మంది ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునే వేదిక సార్వత్రిక ఎన్నిక.

అలాంటి చారిత్రాత్మక ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఎన్నికతో పాటు నాలుగు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలకు కూడా ఎన్నికల సంఘం ముహూర్తం నిర్ణయించేసింది. మార్చి 10వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఏడు దశలలో పోలింగ్ జరుగనుంది. ఏప్రిల్ 11వ తేదీన తొలిదశలో 20 రాష్ట్రాలకు సంబంధించి 41లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఏప్రిల్ 18వ తేదీన రెండో దశలో 13రాష్ట్రాలకు సంబంధించి 97లోక్‌సభ స్థానాలకు, 3వ విడతలో ఏప్రిల్ 23వ తేదీన 14రాష్ట్రాలకు సంబంధించి 115 స్థానాలలో, ఏప్రిల్ 27వ తేదీన నాలుగో విడతలో 9రాష్ట్రాలకు సంబంధించి 71 స్థానాలలో, మే 6వ తేదీన ఐదో విడతలో 7 రాష్ట్రాలకు సంబంధించి 51 స్థానాలలో, మే 12వ తేదీన ఆరో విడతలో 7 రాష్ట్రాలకు సంబంధించి 59 స్థానాలలో మే 19వ తేదీ ఏడో దశలో 8రాష్ట్రాలకు సంబంధించి 59 స్థానాలలో ఎన్నికలు జరుగనున్నాయి. మే23వ తేదీన దేశ వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు వెలువడి కేంద్రంలో ఏ పార్టీ అధికారం చేపట్టనుందనేది తేలనుంది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభలకు కూడా ఎన్నికలు నిర్వహిస్తారు.

ఇక తొలివిడతలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాలలో ఒకేసారి ఎన్నికలు పెట్టడం వల్ల డబుల్ ఓటు సమస్యను అధిగమించే అవకాశ ముంది. సీమాంధ్రులు చాలామంది హైదరాబాద్ మరియు కొన్ని తెలంగాణ పట్టణాల్లో ఓటు హక్కును కలిగి వుండడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తమ సొంత గ్రామాలలో కూడా ఓట్లు కలిగి వున్నారు. రెండు చోట్లా ఒకేరోజు ఎలక్షన్‌తో ఈ సమస్యను చాలావరకు ఎదుర్కొన్నట్లే!

ఏపిలోని 175 శాసనసభ స్థానాలకు కూడా ఏప్రిల్ 11వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఏపి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మార్చి 18న నోటిఫికేషన్ వెలువడుతోంది. 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 28వ తేదీ నామినేషన్ల ఉపసంహారణ వుంటుంది. నామినేషన్ల ఉపసంహారణ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 10రోజులు మాత్రమే గడువు వుంటుంది. దేశ ఎన్నికల చరిత్రలో అభ్యర్థుల ప్రచారానికి ఇంత తక్కువ వ్యవధి రావడం ఇదే తొలిసారి.

ఏపిలో ఇంతవరకు ప్రధాన పార్టీలు రెండూ పూర్తిస్థాయిలో అధికారికంగా అభ్యర్థులనే ఖరారు చేయలేదు. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసిపిలు రెండూ కూడా ఇంత తొందరగా ఏపిలో ఎన్నికలు పెడతారని ఊహించలేదు. ఏప్రిల్ 11వ తేదీన పోలింగ్ అనడంతో ఇరు పార్టీల నాయకులు షాకయ్యారు. వెంటనే పార్టీ అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభ్యర్థుల ఎంపిక పనిలో పడ్డారు. అలాగే వ్యవధి తక్కువగా ఉండడంతో సుడిగాలి ప్రచారానికి ఇరు పార్టీల అధినేతలు సమాయత్తమవుతున్నారు.

2014 ఎన్నికల్లో బీజేపీ పూర్తి స్థాయి మెజార్టీతో అధికారంలోకి రావడం తెలిసిందే! బీజేపీకి సొంతంగా 283 స్థానాలు రాగా ఎన్డీఏలోని మిత్రపక్షాలను కలుపుకుని 334 స్థానాలు వచ్చాయి. కాంగ్రెస్ 44 స్థానాలకు పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయింది. ఆ ఎన్నికల్లో యూపిఏ ప్రభుత్వ కుంభకోణాలపై దేశ ప్రజలు ఎంతగా విరక్తి చెందారనే విషయం బయటపడింది. అదే సమయంలో నరేంద్ర మోడీ పట్ల దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకం బీజేపీ అనుహ్య విజయానికి బాటలు వేసింది.

మరి రేపు జరిగే ఎన్నికలు ఎవరితో ఎవరికి జరగబోతున్నాయి? అయిదేళ్ళ ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం కాబోతున్నాయా? దేశ ప్రజలు నరేంద్ర మోడీకి సరైన ప్రత్యామ్నాయంగా రాహుల్‌గాంధీని ఆదరిస్తారా? లేక ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు బలం పుంజుకుని ప్రభుత్వ ఏర్పాటులో మూడో ఫ్రంట్ కీలకపాత్ర పోషించబోతుందా? కేంద్రంలో బీజేపీని కాదు నరేంద్ర మోడీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ నేతృత్వంలో దాదాపు 23పార్టీలు ఒక కూటమికట్టాయి. అయితే వీటిలో ఎక్కువ పార్టీలు, వాటి నాయకులు పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవాళ్ళే! మరి ప్రజలు వీళ్లను నమ్ముతారా? కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో 44సీట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో అంతకంటే మెరుగైన ప్రదర్శన చేయగలుగుతుందా? ఆ పార్టీకి పెద్దసంఖ్యలో సీట్లొచ్చే రాష్ట్రాలు కూడా పెద్దగా లేవు. ఆ పార్టీ ఆశలు పెట్టుకున్నది కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలపైనే! కాని అక్కడ రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే కాంగ్రెస్‌కు ఈసారి వందసీట్లు వస్తే గొప్పేననిపిస్తోంది.

సర్వేలన్నీ కూడా కేంద్రంలో మళ్ళీ బీజేపీదే అధికారం అని ఘోషిస్తున్నాయి. మోడీ పాలనపై తొలినాళ్ళలో భారీ స్థాయిలో అంచనాలున్నాయి. అయితే ఆయన నూరుశాతం అంచనాలను చేరుకోలేకపోవచ్చుగాని అవినీతి కుంభకోణాలకు తావులేని ఒక నిజాయితీ ప్రభుత్వాన్ని ప్రజలకు అందించాడు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి వాటివల్ల మోడీ ప్రభుత్వంపై ప్రజల్లో కొంత అసంతృప్తి కనిపించినా మౌలిక రంగాలలో సాధించిన అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడం, నీతివంతమైన పాలన, రైతులకు ఆర్థిక భద్రత, పిఎంఆర్‌వై గృహనిర్మాణాలు, దేశ వ్యాప్తంగా విద్యుద్దీకరణ, రైల్వే ప్రగతి, ఉగ్రశిబిరాలపై మెరుపుదాడులు, ప్రపంచ దేశాలలో పెరిగిన దేశ ప్రతిష్ట... ఇత్యాది అంశాలన్నీ కూడా ప్రజల్లో మళ్ళీ మోడీ ఇమేజ్‌ను పెంచాయి. దేశం భద్రంగా ఉం డాలంటే మళ్ళీ మోడీనే ప్రధాని కావాలి అనే ఒక బలమైన నినాదం ఇప్పుడు దేశ వ్యాప్తంగా వినిపిస్తుండగా, బీజేపీయేతర పక్షాలు మాత్రం మోడీపై వ్యతిరేకత, నోట్ల రద్దు వైఫల్యాలు, మైనార్టీ ఓటు బ్యాంకులు బీజేపీని కూలదోసి తమకు పట్టం కడతాయని నమ్ముతున్నాయి.

---

### మూలస్థానేశ్వరునికి

## నేత్రపర్వంగా.. ధవనోత్సవం




నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వ రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా ఈనెల 10న ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో ధవనోత్సవం నిర్వహించారు. ప్రత్యేకించి వివిధ సుగంధభరిత పుష్పాలతో, పరిమళభరితమైన ధవనంతో స్వామిని-అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేసి, అమ్మవారికి అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం మూలవర్లకు పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులిమి వెంకటరెడ్డి-మల్లికార్జునరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆలయ ఇ.ఓ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం రాత్రి 7 గంటలకు స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు.

## ఇస్లాం హింసకు వ్యతిరేకం

ఇస్లాం హింసకు వ్యతిరేకమని, శాంతికి చిహ్నమని మధ్య ప్రదేశ్‌కు చెందిన మౌలానా కలీమ్ అష్రఫ్ సాబిరి పేర్కొన్నారు. ఈ నెల 10న నెల్లూరు బారాషాహిద్ దర్గాలో ఇజ్‌దిమా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులంతా ఒకరికొకరు సహకారం అందించుకుని ప్రేమతో మెలగాలన్నారు. ఇస్లాం మానవత్వం నేర్పుతుందన్నారు. 5పూటలా నమాజులు, రంజాన్ ఉపవాసదీక్షలు పాటించాలన్నారు. మౌలానా అబ్దుల్ కలామ్, సయ్యద్ ముఖారిఖాన్, ఇస్మాయిల్ ఖాదిరి పాల్గొన్నారు.

---




## జాతీయవాదాన్ని బలపరుద్దాం

సైనికుల త్యాగాలను ఒక పార్టీ నాయకుడు అవమానిస్తాడు... పాకిస్థాన్ మీద దాడి చేస్తే ఇక్కడి ముస్లింలు బాధపడతారని లౌకికవాదం ముసుగు కప్పుకున్న ఇంకో పార్టీ నాయకుడంటాడు. అసలు పుల్వామాలో జరిగింది ఉగ్రదాడి కాదని, యాక్సిడెంట్ అని ఓ కాంగ్రెస్ మాజీముఖ్యమంత్రి అంటాడు. ఎవరు వీళ్ళంతా? దేశ ద్రోహులా? జాతి విద్రోహులా? ఇలాంటివాళ్ళను కాల్చి చంపినా పాపం లేదనిపిస్తోంది. దేశానికి పట్టిన చీడ పురుగులు వీళ్ళు. ఓట్ల కోసం దేశాన్నయినా పాకిస్థాన్‌కు అమ్మేసే వంకరబుద్ధి వున్న నాయకులు. ఈ లక్షణాలు గల నాయకుల చేతుల్లోకి దేశం వెళితే ఎంత ప్రమాదమో వూహించండి. దేశ భద్రతను కాంక్షించే మోడీలాంటి నాయకత్వం దేశానికి ఎంత అవసరమో గుర్తించండి. జాతీయవాద శక్తులను ఈ ఎన్నికల్లో బలపరచండి.

**నాదా విశ్వేశ్వరరావు, హైదరాబాద్.**

## ఆడలేక మద్దెలదరువు

ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు భయం పట్టుకుంది. 5ఏళ్ల పాలనలో ఎన్నో తప్పులు చేశాడు. వేలకోట్లు దుర్వినియోగం చేశాడు. దీనికితోడు ఓటు-నోటు, డేటా స్కాంలు ఆయనను నిద్రపోనీయడం లేదు. వీటి నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి మోడీ, కేసీఆర్, జగన్‌లు కలిసి తనపై కుట్రలు పన్నుతున్నారంటూ విషప్రచారానికి తెరతీశాడు. చంద్రబాబు మీద కుట్రలు చేసేంత తీరిక మోడీకి వుందా? ఇక కేసీఆర్‌తో తాను కలిస్తే సంసారం, ప్రత్యర్థి కలిస్తే వ్యభిచారం అన్నట్లుగా సీన్ క్రియేట్ చేస్తున్నారు. సొంత బావమరిది నందమూరి హరికృష్ణ మృతదేహం పక్కనే కేటీఆర్‌తో పొత్తు కోసం చర్చలు జరిపిన చరిత్ర చంద్రబాబుది. మరి టిఆర్ఎస్‌తో చంద్రబాబు పొత్తుపెట్టుకుని వుంటే అప్పుడు కేసీఆర్ మంచోడై వుండేవాడా? జగన్ కేసీఆర్‌తో పొత్తు పెట్టుకోలేదు. టీఆర్ఎస్‌తో ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు. వాళ్ళు ఆహ్వానించినా కూడా ఫెడరల్ ఫ్రంట్‌లో చేరలేదు. జగన్ ఒక్కడే రాష్ట్రంలో సొంతంగా పోరాడుతున్నాడు. చంద్రబాబే ఆడలేక మద్దెలదరువన్నట్లు ఓటమి భయంతో ఏదేదో మాట్లాడేస్తున్నాడు.

**డి.సంజీవ్, నెల్లూరు.**

## డిజిపిని మార్చాలి

ప్రస్తుత డిజిపి ఆర్‌పి ఠాకూర్ సారధ్యంలో రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే పరిస్థితి లేదు. ఆయన పక్కా చంద్రబాబు మనిషి అనే ముద్ర వేయించుకున్నాడు. తెలుగుదేశంకు అనుకూలంగా వ్యవహరించే ఆఫీసర్లను కీలక పదవులలో వుంచాడు. విశాఖలో జగన్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు డిజిపి ఠాకూర్ ప్రెస్‌మీట్ పెట్టి చేసిన వ్యాఖ్యలతోనే ఆయన వైఖరి ఏంటో అర్థమైపోయింది. కాబట్టి రాష్ట్రంలో ఎన్నికలు నిష్పాక్షికంగా జరగాలంటే ఎన్నికల కమిషన్ వెంటనే డిజిపిని మార్చాలి.

**తోడేటి శంకర్‌దాస్, గూడూరు.**

## నల్లపరెడ్లు, నేదురుమల్లి సహకారం తీసుకోండి

వెంకటగిరి నియోజకవర్గంలో నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలకు బలమైన ఓటు బ్యాంకులున్నాయి. వెంకటగిరి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి ఆ రెండు కుటుంబాలను సమన్వయం చేసుకుని ముందుకుపోవాలి. వారి సహకారంతో వెంకటగిరిలో ఆనంకు భారీ మెజార్టీ ఖాయం.

**ఆర్.రఘు, డక్కిలి.**

# యుద్ధానికి సైన్యం సిద్ధం




ఎన్నికల కోడ్ కూసింది. అక్షర క్రమంలోనే కాదు, ఎన్నికలలోనూ మీరే ముందంటూ తొలిదశ ఎన్నికలను ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్టారు. ఇంత తొందరగా ఎన్నికలు ముంచుకొస్తాయని ఎవరూ వూహించలేదు. దీంతో ఇరు పార్టీల అధిష్టానాలు గెలుపుగుర్రాలను ఎలక్షన్ రేస్‌కు సిద్ధం చేసే పనిని ఆఘమేఘాల మీద మొదలుపెట్టాయి.

నెల్లూరుజిల్లాలో చూస్తే పది అసెంబ్లీ స్థానాలలో ఒకట్రెండు చోట్ల తప్ప అన్ని చోట్లా అభ్యర్థులపై క్లారిటీ వచ్చింది. నియోజకవర్గాల వారీగా చూస్తే ఏ నియోజకవర్గంలో ఎవరి అవకాశాలు ఎంతంత మాత్రంగా వున్నాయనేదానిపై ఓ విశ్లేషణ. పోటీలో జనసేన, బీజేపీ, సీపీఎం వంటి పార్టీలు కూడా ఉండేటప్పటికీ ప్రధాన పోటీ మాత్రం తెలుగుదేశం, వైసిపిల మధ్యే వుండబోతోంది.

## హోరాహోరీగా నెల్లూరు నగరం...





ఈసారి రసవత్తరంగా వుండబోతుంది. వైసిపి నుండి సిట్టింగ్ ఎమ్మెల్యేగా పి.అనిల్‌కుమార్‌యాదవ్, టిడిపి నుండి మంత్రి పి.నారాయణ రంగంలోకి దిగారు. నెల్లూరు నగరం నుండి అనిల్‌కు వరుసగా ఇది మూడో ఎలక్షన్. దాదాపు పదేళ్లుగా ఆయన నగర ప్రజల మధ్యే వుంటున్నాడు. ప్రజాసమస్యల పోరాటాలలో వుంటున్నాడు. అన్నింటికంటే కూడా జగన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా వుంటూ వై.యస్. అభిమానులకు చేరువయ్యాడు. సిటింగ్ ఎమ్మెల్యేగా అనిల్‌పై ఎటువంటి వ్యతిరేకత లేదు. ప్రభుత్వంపై బలమైన వ్యతిరేకత అనిల్‌కు అనుకూలం కానుంది. రాష్ట్రంలో జగన్‌కు ఓ అవకాశమిద్దామనే సాధారణ ప్రజల ఆలోచన కూడా అనిల్‌కు కలిసిరావచ్చు. ఇక కొత్తగా నమోదైన ఓటర్లలో సైతం మెజార్టీ షేర్ వైసిపికే రావచ్చు. ఎందుకంటే ప్రత్యేకహోదా ఉద్యమాల ద్వారా ప్రజల్లోకి ఎక్కువుగా వెళ్లింది వైసిపినే! జగన్ యువనాయకుడు కావడం, అనిల్ కూడా యువకుడే కావడం, నగరంలో యువత ఎక్కువుగా వుండడం కూడా అనిల్‌కు కలిసొచ్చే అంశం.

టీడీపీ అభ్యర్థిగా మంత్రి పి.నారాయణకు తొలి ఎన్నికలివి. ఆయన పార్టీ కండువాను భుజం మీద వేసుకున్నది కూడా ఇప్పుడే! నగరంలో నారాయణ అయితేనే గట్టి పోటీనివ్వగలడనే ప్రచారం నేపథ్యంలో ఆయన పోటీకి దిగాల్సివచ్చింది. నారాయణకు ఖచ్చితంగా ఓటేసి గెలిపించాలనేంత అభిమానం వచ్చేటంత గొప్పగా గతంలో నారాయణ నెల్లూరులో సేవా కార్యక్రమాలేమీ చేయలేదు. క్రింద స్థాయి నుండి స్వయంకృషితో జాతీయ స్థాయిలో విద్యాసంస్థలను విస్తరించిన కృషీవలుడిగా ఆయనకు పేరుంది. పోతే, గత నాలుగేళ్ళ కాలంలో నగరంలో భారీ ఎత్తునే వందల కోట్లలో అభివృద్ధి పనులు జరిగాయి. అయితే ఈ పనులు ఒక కాలమాన ప్రకారం ఒక పద్ధతిగా జరిగివుంటే నారాయణకు ఆ పేరొచ్చేది. కాని వందల కోట్ల పనులను కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే హడావిడిగా చేయించాడు. దీనికితోడు కాంట్రాక్ట్ పనులన్నీ కూడా ఒకరికే ఇవ్వడం వల్ల కూడా నారాయణకు అనుకున్నంత మైలేజీ రాకుండా పోయింది. సిమెంట్ రోడ్లు, పార్క్‌లు, ఎన్టీఆర్ ఇళ్ళు భారీఎత్తున జరిగినా సరైన ప్లానింగ్ లేక, వాటి మీద నారాయణ తన బ్రాండ్ వేసుకోలేకపోయాడు. నియోజకవర్గంలోని రెండో నగర పరిధిలో టీడీపీకి సాంప్రదాయ ఓటు బ్యాంక్ వుంది. సొంత సామాజికవర్గమైన కాపులపై నారాయణ బలంగా ఆశలు పెట్టుకుని వున్నాడు. ఇక ఆర్థికశక్తి ప్రభావం కూడా బాగానే పని చేయొచ్చు. నారాయణ నెట్‌వర్క్ బాగానే వుంది. అయితే ఇక్కడ ఒక్కటైతే నిజం... తెలుగుదేశం ఫ్లేవర్‌తో నారాయణ గెలవాలంటే కష్టం... ఎంతవరకైనా సరే తన సొంత పరపతి తోనే ఆయన గెలవాల్సివుంటుంది.

## కోవూరులో పాతకోళ్ళే...!





జిల్లాలోనే సంపన్న నియోజకవర్గంగా పేరుబడ్డ కోవూరు అసెంబ్లీకి టీడీపీ, వైసిపి అభ్యర్థులు ఖరారయ్యారు. టీడీపీ నుండి సిటింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దిగుతుండగా, వైసిపి నుండి మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఎలక్షన్ సంవత్సరం మారిందేగాని అభ్యర్థులు, పార్టీలు మారలేదు. ఇక కోవూరు ఓటర్లు ఎంతవరకు మారారనేది చూడాలి!

2014 ఎన్నికల్లో జిల్లాలోని 10సీట్లలో వైసిపి 3సీట్లు ఓడిపోతే అందులో కోవూరు ఒకటి. ఇక్కడ ప్రసన్న ఓటమికి ప్రత్యేక కారణాలేమీ లేవు. ఆరోజు ఆర్థికంగా ఆయన వెనుకబడి వుండడంతో పాటు సిటింగ్ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై వున్న వ్యతిరేకత కూడా ప్రసన్నపై ప్రభావం చూపింది. దీనికితోడు ఆరోజు తెలుగుదేశం ఎంపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కావడం కూడా ప్రసన్న ఓటమికి ఓ కారణం.

కాని, అప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో చాలా మార్పులొచ్చాయి. 2014 ఎన్నికల్లో కోవూరులో తెలుగుదేశంకు కాంగ్రెస్ కేడర్ తోడయ్యింది. అంతకు రెండేళ్ళ క్రితమే జరిగిన ఉపఎన్నికల్లో ప్రసన్న పోటీ చేసి గెలిచి వున్నాడు. 2014 ఎన్నికల నాటికి కొంత ఓటు డైవర్ట్ అయ్యింది. పోలంరెడ్డి అంతకుముందు రెండుసార్లు ఓడిపోయి వుండడంతో ఆయనకు మళ్ళీ ఒక ఛాన్స్ ఇద్దామనే కోణం కూడా ఆయనకు కలిసొచ్చింది.

రేపటి ఎన్నికల్లో పోలంరెడ్డికి అన్ని ఆప్షన్స్ లేవు. పార్టీ కేడర్, సొంత బలగం... వీటి మీదే ఆయన గెలుపు ఆధారపడి వుంది. తెలుగుదేశం ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత వుంది. సిటింగ్ ఎమ్మెల్యేగా పోలంరెడ్డిపై కూడా వ్యతిరేకత వుంది. ఇక తెలుగుదేశంలోనే అసమ్మతి వుంది. నాయకులంతా కలిసి కట్టుగా పనిచేస్తారనే నమ్మకం లేదు. కాకపోతే ఎలక్షన్ చేయడంలో పోలంరెడ్డి ఘనాపాటి. ఆశలు పూర్తిగా నిర్వీర్యమైనా కూడా ఆశలు మళ్ళీ చిగురించేలా చేయగల సమర్థుడు. కాబట్టి పార్టీ కేడర్ కంటే కూడా ఆయన సొంత వ్యూహంపైనే పార్టీ గెలుపోటములు ఆధారపడి వుంటాయి.

నల్లపరెడ్డి ప్రసన్నరెడ్డికి మాత్రం ఈ ఎన్నికలలో గెలుపు అవసరం. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, సిటింగ్ ఎమ్మెల్యేపై నియోజకవర్గంలో సానుకూల ధోరణి లేకపోవడం ప్రసన్నకు కలిసొచ్చే అంశం. ఇక జగన్‌పై ప్రజల్లో వున్న ఆదరణ, ప్రసన్న గత ఎన్నికల్లో ఓడిపోయి వుండడం, అయినా పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్యనే వుండడం వంటివి ఆయనకు ఉపయోగపడొచ్చు. సొంత వర్గముంది. కాకపోతే ఆర్థిక వనరుల్లో వీక్ అనే ప్రచారముంది. నియోజకవర్గంలో 'రెడ్డి' సామాజికవర్గం బలమెక్కువ. ఈసారి ఈ వర్గీయులంతా కూడా జగన్‌ను గట్టిగా బలపరుస్తున్నారు. ఇది కూడా ప్రసన్నకు కలిసొచ్చే అంశం.

మొత్తానికి కోవూరు బరిలో పాత కోళ్ళే పందేనికి దిగాయి. ప్రసన్నకు పార్టీ బలం పెద్ద ఆధారమైతే పోలంరెడ్డికి పార్టీకంటే సొంత వ్యూహం, సొంత అనుచర గణమే పెద్ద ఆయుధం.


## జనసేన... ఎవరి గెలుపుకు గండి కొడుతుందో?



2009 ఎన్నికల్లో జిల్లాలో ప్రజారాజ్యం 10 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసింది. నెల్లూరు నగరంలో గెలవడంతో పాటు నెల్లూరురూరల్ నియోజకవర్గంలో గెలుపు అంచుల దాకా వచ్చి ఓడిపోయింది. అంతేకాదు, కావలి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయేలా ప్రజారాజ్యం ఓట్లు చీల్చింది.

అప్పటి ప్రజారాజ్యానికి ప్రతిరూపమే నేటి జనసేన. కాకపోతే అప్పుడు అది 'అన్నయ్య' చిరంజీవి పెట్టిన పార్టీ... ఇప్పుడు 'తమ్ముడు' పవన్ కళ్యాణ్ పెట్టిన పార్టీ ఇది. జనసేన పార్టీకి జిల్లాలో ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదు. కాని, గెలుపోటములను ప్రభావితం చేయగల స్థితిలో జనసేన వుంది. ముఖ్యంగా నెల్లూరు సిటి, రూరల్, కావలి నియోజకవర్గాల్లో జనసేన ప్రభావం వుండబోతుంది. నెల్లూరు నగరంలో పవన్ అభిమానులు బాగానే వున్నారు. ఇక కాపు సామాజికవర్గం బలంగానే వుంది. అయితే ఇక్కడ టీడీపీ అభ్యర్థి నారాయణ కూడా కాపు సామాజికవర్గాన్నే నమ్ముకుని వున్నారు. కాబట్టి, జనసేనతో నెల్లూరు సిటీలో కొంత తెలుగుదేశానికే ఇబ్బంది కలగొచ్చు. నెల్లూరురూరల్‌లో జనసేన వల్ల అటు వైసిపికి ఇటు టిడిపికి ఓట్లు తగ్గొచ్చు. కావలిలో మాత్రం వైసిపి అభ్యర్థిగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్ పోటీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కావలిలో వడ్డెర వర్గమంతా కూడా తెలుగుదేశం మద్దతు దారులే! రేపు వీళ్లంతా కూడా జనసేనకు మొగ్గు చూపితే నష్టం తెలుగుదేశానికే!

## 2019 'మిస్' అయ్యిందెవరు?



2014 ఎన్నికలకు 2019 ఎన్నికలకు చాలా దగ్గరి సంబంధముంది. 2014 ఎన్నికల్లో అటు తెలుగుదేశం, ఇటు వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులందరు కూడా దాదాపు మళ్ళీ 2019 ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఈ ఎన్నికల్లో మళ్ళీ పోటీకి దూరమైన వాళ్ళు చాలా తక్కువ మంది కనిపిస్తున్నారు.

2014 ఎన్నికల్లో వెంకటగిరి అసెంబ్లీ నుండి వైసిపి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఆయన ప్రస్తుతం వైసిపిలో కూడా లేదు. ఇటీవలే తెలుగుదేశంకు దగ్గరయ్యాడు. చేస్తే ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయొచ్చు. ఇక 2014లో గూడూరు అసెంబ్లీ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ బి.జ్యోత్స్నలతకు ఈ ఎన్నికల్లో టిక్కెట్ రాలేదు. 2014 ఎన్నికల్లో వైసిపి నుండి ఎమ్మెల్యేగా గెలిచి తెలుగుదేశంలో దూరిన పాశం సునీల్‌కుమార్‌కే గూడూరు సీటిచ్చారు. గత ఎన్నికల్లో నెల్లూరు నగరం నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి కూడా ఈ ఎన్నికల్లో సీటు లేదు. ఆయన బదులు మంత్రి పి.నారాయణ ఈ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నాడు.

అలాగే 2014 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన గూటూరు కన్నబాబుకు కూడా ఈ ఎన్నికల్లో సీటు లేదు. ఆయన బదులు మాజీఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యను ఇక్కడ రంగంలోకి దించారు.

2014 ఎన్నికల్లో పోటీ చేసిన వాళ్ళలో చాలా తక్కువమందే మళ్ళీ టిక్కెట్లు పొందలేకపోగా వారిలో ముగ్గురు నాయకులు తెలుగుదేశం వాళ్ళే ఉండడం గమనార్హం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

## అందరూ సామాన్యులే!

సార్వత్రిక ఎన్నికల కోడ్ ఈ నెల 10 నుంచి అమలులోకి రావడంతో ప్రజాప్రతినిధులందరూ సామాన్యులయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యులకు ఇక ప్రోటోకాల్ వర్తించదు. వీరు ఎటువంటి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఇప్పటివరకు వీరివద్ద పనిచేస్తున్న పోఏస్‌డిలు, పిఏస్‌లు, ఇతర ప్రభుత్వఉద్యోగులు వెనక్కు వచ్చేయాల్సిందిగా ఉన్న తాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. జూన్ 3వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

## వైటీ నాయుడికి మంత్రి నారాయణ పలకరింపు



అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకుడు వైటీనాయుడిని నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న ఆయన నివాసంలో మంత్రి నారాయణ పలకరించి, వైటీ ఆరోగ్యపరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌తో మాట్లాడాలని ఉందని వైటీ చెప్పగా, నారాయణ వెంటనే ఫోన్‌చేసి లోకేష్‌తో మాట్లాడించారు. నెల్లూరుకు వచ్చినప్పుడు మంత్రి నారాయణతో కలసి మీరు మా ఇంటికి రావాలని వైటీ ఆహ్వానించగా అందుకు లోకేష్ సమ్మతించారన్నారు. నెల్లూరు నగరంలో తన విజయం కోసం ప్రచారానికి రావాల్సిందిగా వైటీని మంత్రి నారాయణ కోరగా, మీ గెలుపుకోసం తప్పకుండా కృషిచేస్తానని వైటీ హామీ ఇచ్చారు.

## పల్స్‌పోలియో విజయవంతం



పోలియో చుక్కలు వేయించుకుంటున్న జిల్లా కలెక్టర్ కుమారుడు

ఈ నెల 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంలో 93.22 శాతం లక్ష్యం సాధించారు. జిల్లా వ్యాప్తంగా 3072 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో గ్రామీణ ప్రాంతాలలోనే 2628 పోలియో కేంద్రాలు, పట్టణ ప్రాంతాలలో 444 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 3,11,003 మందికి పోలియో చుక్కలు వేయగా 2224 మంది ఆశా కార్యకర్తలు, 3705 మంది ఐసిడిఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. 1251 పారామెడికల్ సిబ్బంది, 706 నర్సింగ్ సిబ్బంది, ఇతర శాఖల నుండి 5021మంది తమ సేవలు అందించారు.

## ప్యాసింజర్ రైళ్ళకు గ్రీన్ సిగ్నల్

ఇటీవల నిలిపివేసిన గూడూరు - విజయవాడ ప్యాసింజర్(57277), విజయవాడ - బిట్రగుంట ప్యాసింజర్(57278) రైళ్ళను రైల్వే అధికారులు పునరుద్ధరించారు. ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని పునరుద్ధరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## సిసిఎస్ ఇన్స్‌పెక్టర్‌గా సీతారామయ్య



సెంట్రల్ క్రైం పోలీస్‌స్టేషన్(సిసిఎస్) ఇన్స్‌పెక్టర్‌గా ఈ నెల 10న సీతారామయ్య బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సీతారామయ్య 2002లో పోలీస్‌శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని దుత్తలూరు, బిట్రగుంట, ముత్తుకూరు, వేదాయపాలెం పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వహించారు. 2011లో సిఐగా పదోన్నతి పొంది దర్గామిట్ట పోలీస్‌స్టేషన్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్‌గా జిల్లాలో పనిచేసి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన సిఐల బదిలీల్లో సిసిఎస్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులయ్యారు. సీతయ్య ఎవరి మాట వినడనే పేరుంది.

## 22న జడ్పీ స్టాండింగ్ కమిటి సమావేశాలు

నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న స్టాండింగ్ కమిటి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సిఇఓ సి.సుధాకర్‌రెడ్డి ఈనెల 11న ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు గ్రామీణాభివృద్ధి, 10.45గంటలకు వ్యవసాయం, 11.30గంటలకు విద్య, వైద్యం, మధ్యాహ్నం 12.15 గంటలకు స్త్రీ సంక్షేమం, రక్షణ, 3గంటలకు సాంఘిక సంక్షేమం, 3.30 గంటలకు ప్రణాళిక, ఆర్థిక పనులకు సంబంధించిన స్టాండింగ్ కమిటి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నెల్లూరులో కత్తి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు ప్రజల అభిప్రాయాలను, మనోభావాలను తెలుసుకునేందుకు బిగ్‌బాస్‌లో పాల్గొన్న రచయిత, విమర్శకుడు కత్తి మహేష్ ఈ నెల 11న నెల్లూరు వచ్చాడు. ఓ ఛానల్ తరపున వచ్చినట్లు ఆయన పేర్కొన్నాడు. ఇందులో భాగంగా బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డిని కలుసుకున్నాడు.

## చేపల మార్కెట్‌పై విజిలెన్స్ పంజా

నెల్లూరులోని చేపల మార్కెట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల శాఖ అధికారులు ఈనెల10న సంయుక్తంగా దాడులు చేశారు. అధికారులు రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు నగరంలోని పెద్దబజార్, డైకస్‌రోడ్డు, జలపుష్ప భవన్, మైపాడుగేటు వద్దనున్న మత్స్యభవన్‌లో తనిఖీలు నిర్వహించారు. జలపుష్పభవన్‌లో నిషిద్ధ క్యాట్‌ఫిష్‌ను విక్రయిస్తున్న వ్యాపారి నుంచి 40కేజీల చేపలను స్వాధీనం చేసుకుని ఆ వ్యాపారిపై చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో వ్యాపారుల నుంచి కాటాలను స్వాధీనం చేసుకొని 10మందిపై కేసులు నమోదు చేశారు.

### ఎంఎస్ఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణి



విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేస్తున్న చందు

నెల్లూరులోని సుంకు చెంగన్నశెట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 11న మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో మన ఊరు - మన బాధ్యత అనే నినాదంతో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు. అనేక పాఠశాలల్లో తమ సేవా సమితి ద్వారా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించామని రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలకు తమ సేవాసమితి తరపున సహాయసహకారాలు అందిస్తామన్నారు. నుడా డైరెక్టర్ ఖాజావలి, పాముల హరిప్రసాద్, కమతం అశోక్, సాయిబాబు, విశాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపిలోకి సన్నపరెడ్డి



ఒకప్పుడు ఆనం కుటుంబంలో ఒకడిగా వుండి ఆ తర్వాత కాలంలో వారి నుండి వేరుపడి కొంతకాలం వైసిపిలోను, 2014 ఎన్నికల తర్వాత టీడీపీలోనూ కొనసాగిన ఆయిల్‌మిల్ పెంచలరెడ్డి(సన్నపరెడ్డి పెంచలరెడ్డి) మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నాలుగున్నరేళ్ళుగా తెలుగుదేశంలో వున్నాను, వ్యాపారవర్గాల వారికి పార్టీలో సరైన గౌరవం లేకుండాపోయిందని బాధపడిన ఆయన, ఈ నెల 12వ తేదీన తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు.

## ఆంజనేయుడికి ఓ పదవి



బీజేపీలో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం వ్యక్తిగతంగా ఎన్నో కష్టనష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడ్డ ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిని ఎట్టకేలకు ఓ పదవి వరించింది. అగ్రికల్చర్ ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) సభ్యుడిగా కేంద్ర ప్రభుత్వం ఆయనను నియమించింది. ఈ మేరకు అపెడా బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలానికి పార్టీయేతర పదవిని పొందిన ఆంజనేయరెడ్డిని సహచర బీజేపీ నాయకులు అభినందించారు.

## డా.కిషోర్స్ రత్నం విద్యార్థుల ప్రతిభ



మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు సాధించిన రత్నం విద్యార్థులు

నెల్లూరు సరస్వతినగర్‌లో ఉన్న డా.కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభను చాటుకుని బంగారు పతకాలు సాధించారు. 2వ తరగతి చదువుతున్న టి. దియా, బి.దేవ్రిత్ (3వ తరగతి), 4వ తరగతికి చెందిన కె.వాణీవినోదిని, కె.దశ్మిత, పి.సుశాంత్, సిహెచ్ ధృవ్ అన్ష్, టి.జానకి రఘురామ్, 5వ తరగతి చదువుతున్న ఏ.రితేష్‌లు బంగారు పతకాలు సాధించారని డా.కిషోర్స్ జెన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు ఆ విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా, 4వ తరగతికి చెందిన సి.నవదీప్, 5వ తరగతి విద్యార్థిని సిహెచ్ భార్గవిచౌదరి వెండి పతకాలను సాధించారని, ఎం.రుషచంద్ర (4వ తరగతి), ఎం.హర్షిత సాయి(5వతరగతి) కాంస్య పతకాలను సాధించారని, మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో అసాధారణ ప్రతిభ ప్రదర్శించినందుకు ఈ పతకాలు వారికి లభించాయని ఆయన పేర్కొన్నారు. స్కూల్ డైరెక్టర్ డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు రూపొందించిన అత్యుత్తమ మెటీరియల్స్, పరీక్షా విధానాలతో ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జాస్మిన్, మేనేజర్ అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షునిగా ముక్కాల



జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 11న జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అరిగెల విజయకుమార్, కోశాధికారిగా ఆనం రామకిశోర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట మనోహర్, మలిరెడ్డి శ్రీనివాసులు, కోడూరు రవీంద్రరెడ్డి, పత్తి రవీంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.సురేష్, కె.సనత్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారని, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి సుబ్బారావు, రిటర్నింగ్ అధికారి పులిమి అయ్యపరెడ్డి పరిశీలించారని అసోసియేషన్ సిఇఓ పసుపులేటి రామ్మూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు.



# ముసుగులు పడ్డాయి!

ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అధికారులు చేసే మొదటిపని పాతగుడ్డలు ఏరుకుని దివంగత నేతల విగ్రహాల తలకాయలను కప్పెట్టడం. ఈనెల 10న ఎన్నికల కోడ్ అలా వచ్చిందో లేదో అధికారులు విగ్రహాల తలకాయలకు గుడ్డలు చుట్టేపనికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నప్పుడు నెహ్రూ, ఇందిర, రాజీవ్, ఎన్టీఆర్, వై.యస్. తదితర నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తుంటారు. ఇంతకుముందు ఈ పని కొంత సులువుగా వుండేది. నెహ్రూ, ఇందిరా, రాజీవ్, ఎన్టీఆర్‌ల విగ్రహాలు పెద్ద నగరాలు, పట్టణాలలో తప్పితే మిగతా చోట్ల పెద్దగా వుండవు. అధికారులకు అసలు పనంతా కూడా వై.యస్. విగ్రహాలతోనే! వై.యస్. విగ్రహాలు ఒకటా... రెండా... చిన్న పల్లెటూరిలో కూడా వై.యస్.వి రెండు మూడు విగ్రహాలుంటాయి. ఇక నగరాలు, పట్టణాలలో అయితే సెంటర్‌కొకటుంటుంది. ఈ విగ్రహాలకు ముసుగులు కప్పేటప్పటికే అధికారులకు తలప్రాణం తోకలోకి వస్తుంది.

# టిడిపి కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

## - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వస్తే అంతు చూస్తామని వైయస్సార్సీపీ నాయకులను మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు, అభిమానుల ఓట్లను వైయస్సార్సీపీ నాయకులు తొలగిస్తున్నారని, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, అందుకు నిరసనగా టిడిపి నాయకులు ఈ నెల 11న నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. విఆర్‌సి సెంటర్ నుంచి గాంధీబొమ్మ, ఏసి సెంటర్ మీదుగా నర్తకి సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 50లక్షల ఓట్లు తొలగించి, అందర్నీ భయపెట్టి దౌర్జన్యాలు చేసి అధికారంలోకి రావాలని వైయస్సార్సీపీ కుట్రలు పన్నుతోందన్నారు. తెలంగాణలో 25లక్షల ఓట్లు తొలగించబడ్డాయని స్వయంగా ఎన్నికల సంఘం చెప్పిందని, ఓట్లు తొలగించి గెలుపొందిన కేసిఆర్ గెలుపు ఒక గెలుపేనా అంటూ ఎద్దేవా చేశారు. మోదీ, కేసీఆర్‌ల సలహాలతో రాష్ట్రంలో జగన్ కుట్రలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో వైయస్సార్సీపీ ఎమ్మెల్యేలు కేసుల ఎమ్మెల్యేలుగా మారారని, జిల్లాలో నకిలీ మద్యం, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రోజూ పోలీసుస్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెట్టిన చరిత్ర వైయస్సార్సీపీ నాయకులదని విమర్శించారు.




ర్యాలీలో పాల్గొన్న మంత్రులు సోమిరెడ్డి, నారాయణ, తెలుగుదేశం నాయకులు

మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ జిల్లాలో వైయస్సార్సీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, అడ్డదారుల్లో అధికారంలోకి రావాలని వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసు అధికారులను బెదిరించిన ఘనత వైసిపి ఎమ్మెల్యేకే దక్కిందన్నారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధైర్యంగా ప్రజల ముందుకెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి తమ నాయకుడు చంద్రబాబు నాయుడు కల్పించారన్నారు. రూరల్ నియోజకవర్గంలో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులపై దౌర్జన్యం చేసే స్థితికి వైయస్సార్సీపీ నాయకులు దిగజారారని మండిపడ్డారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక అధికారంలోకి వస్తే సామాన్య ప్రజలు ప్రశాంతంగా జీవించే పరిస్థితి ఉండదన్నారు. నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, ఏపిఎంఐడిసి ఛైర్మెన్ జడ్.శివ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేవూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు ఒక్క మగాడు - బీద



ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును ఎదుర్కొనే సత్తా లేక వై.యస్. జగన్మోహన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, అమిత్‌షాలు ఒక్కటయ్యారని, తెలుగుదేశంను ఓడించేందుకు, చంద్రబాబును ఇబ్బంది పెట్టేందుకు రకరకాల కుట్రలు పన్నుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర ఆరోపించారు. ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒక నాయకుడిని ఎదుర్కోవడానికి ఇంతమంది ఏకం కావడం ఇప్పుడే జరుగుతోందన్నారు. ఏపి డేటా విషయంలో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి డైరెక్షన్‌లో తెలంగాణ పోలీసులు పని చేస్తున్నారని, జగన్ తెలంగాణ సీఎం కేసీఆర్‌కు దాసోహమయ్యాడని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని పాతిపెట్టాడని, రేపటి ఎన్నికల్లో ఆంధ్రులు దీనికి తగిన విధంగా గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# తొలివిడతలోనే ఏపి ఎన్నికలు.. సూపర్

## - బిజెపి నేత కర్నాటి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

తొలివిడతలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరగడం సంతోషదాయకమని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా ఏపిలో ఖరీదైన రాజకీయాలు జరగబోతున్నాయని, చివరిదశలో ఎన్నికలైతే ఇక్కడ పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టడం ఎక్కువగా ఉంటుందని, తొలివిడతగా ఎన్నికలు నిర్వహిస్తే అలాంటి ప్రలోభాలు తగ్గిపోతాయన్నారు. ఈనెల 11న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో విజయం సాధించి మళ్ళీ మోడీయే ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కొన్ని పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇప్పటికే అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటివారిపై జిల్లా అధికారులు నిఘాపెట్టాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించేవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అంబులెన్స్, వ్యక్తిగత వాహనాల్లో డబ్బు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకదృష్టి సారించాలని, ఎన్నికలు పటిష్టంగా, శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసు కోవాలని కోరారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, మారుబోయిన శ్రీనివాసులు, నరసింహులునాయుడు, సుధాకర్‌రెడ్డి, కాయల మధు, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రతిష్ఠాత్మకంగా ఎన్నికల నిర్వహణ

**- కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు**


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని, ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేందుకు అందరి సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అన్నారు. ఈనెల 10వ తేదీన రాష్ట్ర ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనంతరం మీడియాసెంటర్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈనెల 10 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 18 న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నదని, నామినేషన్ ప్రక్రియ 25న ముగుస్తుందని, 26న స్క్రూటినీ అనంతరం 28న నామినేషన్ ఉపసంహరణలకు అవకాశం ఉంటుందని, ఏప్రిల్ 11వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, మే23న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. అప్పటిదాకా ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో 22లక్షలా 6వేల మందికి పైగానే ఓటర్లున్నారని, అందులో మహిళా ఓటర్లు 11 లక్షలా 23వేలకు పైగా ఉన్నారన్నారు. జిల్లామొత్తమ్మీద 2,830 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్‌కేంద్రాల్లో అదనపు కేంద్రాల ఏర్పాటుకై కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, జిల్లాలో 511 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. పోలింగ్ అధికారులుగా 23,460 మందిని నియమించామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఆరుగురు సిబ్బంది ఉంటారని, లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి విడివిడిగా ఇవిఎంలు, వివిప్యాట్‌లు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లకు కూడా వెంటనే తగు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను గంటా 40 నిమిషాల్లోనే పరిష్కరించడం జరుగుతుందని, ఏ ఫిర్యాదులనైనా 1950 నెంబర్‌కు కాల్‌చేసి చెప్పవచ్చన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ప్రతి అభ్యర్థికి 28 లక్షల వరకు, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 70 లక్షల వరకు వ్యయపరిమితి ఉంటుందన్నారు.

## ఎన్నికల నిర్వహణకు 5వేల మంది పోలీసులు - జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



జిల్లాలో ఎన్నికలను ప్రశాంతవాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నిర్వహణకు 5వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి తెలిపారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేకనిఘా ఉంటుందని, జిల్లా చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు నిర్వహిస్తామని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేస్తామని, ప్రజలు శాంతియుతంగా ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జేసీ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న మునిసిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన, శివకుమార్‌రెడ్డి

గూడూరు క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన ముక్కోణపు క్యారమ్స్ పోటీల్లో ప్రథమ బహుమతిని తెలంగాణకు చెందిన శ్రీనివాస్ గెలుచుకున్నారు. పోటీల అనంతరం గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 10వ తేదీన విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన ముఖ్యఅతిథిగా పాల్గొని, పోటీల్లో గెలిచిన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో క్యారమ్స్ పోటీలు గూడూరులో నిర్వహించడం పట్టణానికి గర్వకారణమన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలుంటాయన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో తెలంగాణాకు చెందిన శ్రీనివాస్ ప్రథమబహుమతిని సాధించగా, ద్వితీయ, తృతీయ బహుమతులు కూడా తెలంగాణాకు చెందిన అలీమ్, అహ్మద్‌లు గెలుచుకున్నారు. నాల్గవస్థానంలో తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్ నిలిచి బహుమతిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నీరజ్, రోటరీ జిల్లా గవర్నర్ కె. మునిగిరీష్, ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్సీపి నాయకుడు పొణకా శివకుమార్‌రెడ్డి, మనసాటి రవీంద్రబాబు, బాలిబోయిన రమేష్, నిర్వాహకులు శనగల వెంకట్రావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి అలఘునాధస్వామి బ్రహ్మోత్సవాలు


మాట్లాడుతున్న ఆలయ ఛైర్మన్ పెంచలనాయుడు

గూడూరు పట్టణంలోని ప్రాచీనమైన శ్రీ అలఘునాధస్వామి దేవాలయంలో ఈనెల 16 నుంచి 26వ తేది వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ కంకణాల పెంచలనాయుడు చెప్పారు. దేవాలయ ప్రాంగణంలో ఈనెల 8న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. గూడూరు పట్టణంలోని ప్రజలు, పరిసర ప్రాంతాల్లోని భక్తులందరూ బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఇ.ఓ.తో పాటు అర్చకులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

# కనుమూరుకు వైసిపిలో కీలక బాధ్యత


కనుమూరు హరిచంద్రారెడ్డి

గూడూరుకు చెందిన కనుమూరు హరిచంద్రారెడ్డి వైఎస్సార్సీపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. దీంతో ఆయన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కొద్దిరోజుల క్రితం కనుమూరు రవిచంద్రారెడ్డి, ఆయన సోదరుడు హరిచంద్రారెడ్డి వైఎస్సార్సీపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపిలో చేరిన విషయం తెలిసిందే. ఏఐసిసి కార్యదర్శిగా పనిచేసిన రవిచంద్రారెడ్డి, తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి తన సోదరునితో కలసి వైఎస్సార్సీపిలో చేరారు. ఇప్పటికే రవిచంద్రారెడ్డిని వైఎస్సార్సీపి జాతీయ అధికార ప్రతినిధిగా నియమించారు కూడా. ఈ క్రమంలో ఆయన సోదరుడైన హరిచంద్రారెడ్డిని వైఎస్సార్సీపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీలో సముచిత స్థానం కల్పించారు.

## గాయత్రి సేవాసంస్థ ఆధ్వర్యంలో...

# 108 సామూహిక సత్యనారాయణ వ్రతాలు


రత్నం స్కూల్‌లో సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

సమాజానికి మేలు జరగాలన్న ఉద్దేశ్యంతో గూడూరులోని గాయత్రి సేవాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పూలతోటలో ఉన్న రత్నం పాఠశాలలో ఈనెల 9న 108 సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు బి. వెంకటశివప్రసాద్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ, లోకకల్యాణం కోసం ఈ వ్రతాలు, ఉపనయనాలు, అన్నప్రాసన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు వేదపండితులు శాస్త్రోక్తంగా వ్రతాలను జరిపించారు. అనంతరం అన్నవరం నుంచి తెప్పించిన స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి సేవాసమితి సభ్యులు రామకృష్ణమూర్తి, ప్రదీప్‌కుమార్, రవికుమార్ ఇంకా లయన్ నవీన్ జయకుమార్, ఆయన సతీమణి ప్రభావతి, కుమార్తె నీహారిక తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం


పోలీసులతో సమావేశమైన డిఎస్పీ బాబుప్రసాద్

**- డిఎస్పీ బాబుప్రసాద్**

గూడూరు సబ్‌డివిజన్ పరిధిలోని గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో ఎన్నికలను ప్రశాంతంగా, పటిష్టంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని గూడూరు డిఎస్పీ బాబు ప్రసాద్ చెప్పారు. గూడూరులోని డిఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామన్నారు. తొలుత డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువల్ల రాజకీయపార్టీలకు చెందిన నాయకులు సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పని సరిగా పాటించాలని కోరారు. గ్రామాల్లోనూ సజావుగా ఎన్నికలు జరిగేందుకు, ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మహిళలే మహారాణులు..


డాక్టర్ సి.రోహిణిని సన్మానిస్తున్న ఇన్నర్‌వీల్, రోటరీక్లబ్‌ల సభ్యులు

గూడూరులోని ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా స్థానిక ద్వారకామాయి వేడుక భవనంలో ఈనెల 9న మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు, ఆంధ్రమహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభాపాటవాలతో రాణించాలని ఆకాంక్షించారు. నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల అధ్యాపకురాలు రంజిత్ నళిని, ప్రముఖ గాయకురాలు సుగంధినిలను సన్మానించారు. ఆ తర్వాత రోటరీక్లబ్ సభ్యులు, ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు డాక్టర్ సి.రోహిణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ కె.మునిగిరీష్, రోటరీక్లబ్ అధ్యక్షులు హరిప్రసాద్, బి.దశరథరామిరెడ్డి, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, మునిరాజా, ఇన్నర్‌వీల్ సభ్యులు ప్రభారెడ్డి, స్నేహలతారెడ్డి, విష్ణువందన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చొరవతోనే అభినందన్ విడుదల

## ఎలక్షన్ స్టంట్

ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం. ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా తన ఛాంబర్‌లో కూర్చుని ఎన్నికల ఏర్పాట్లపై రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నాడు. అంతలో ఆయన సెల్‌ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తాడు. అవతల నుండి ఏమండి... ఇది బాధగా వుండదండి... నా రక్తం మరిగి పోతుందిక్కడ... మోడీతో కుమ్మక్కై మీరు ఫస్ట్‌ఫేస్‌లోనే మా ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్షన్ పెడతారా... మేం సర్దుకోవడానికి టైం ఇవ్వరా? ఇదేం ప్రజాస్వామ్యమండి... చాలా బాధేస్తుందండి అని హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబునాయుడు చెప్పాడు. దానికి సిఇసి అరోరా... భలే వారు చంద్రబాబు గారు... మీరు అన్నింట్లోనూ ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో వుందని చెబుతుంటారు కదా... అందుకే మేము కూడా మొదటి దశలోనే ఎన్నికలు పెట్టామని అన్నాడు. అందుకు చంద్రబాబు... ఇది టూమచ్ అండి... రేపు కేంద్రంలో చక్రం తిప్పబోయేది నేనే... జాగ్రత్తగా వుండండి అంటూ ఫోన్ పెట్టేశాడు.

★★★★★

ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం. ఎన్నికల కోడ్ వచ్చిందని తెలియగానే మంత్రులు, తెలుగుదేశం నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పచ్చమీడియా ప్రతినిధులు, మాస్క్ మేధావి శివాజీ తదితరులంతా వచ్చేశారు. అప్పుడే లోకేష్ స్వీట్స్ బాక్స్‌తో అక్కడకు వచ్చి అందరికీ పంచసాగాడు. అక్కడున్న కోడెల శివప్రసాద్‌రావుకు ఒళ్లు మండి... మేం టైం లేకుండానే ఎన్నికలు పెట్టేస్తున్నారని ఆందోళన చెందుతుంటే, నువ్వేంటి స్వీట్లు పంచుకుంటున్నావని కోపంగా అడిగాడు. అందుకు లోకేష్... ఒక మధుకోడా, ఒక సురేష్‌కల్మాడీ, ఒక రాజా, ఒక లాలూ ప్రసాద్‌యాదవ్, ఒక మాయావతి... వీళ్లందరి పేర్లు ఏదో ఒక కుంభకోణం ద్వారా దేశమంతా తెలిశాయి. ఈరోజు డేటా చోరీ స్కాంతో అతి చిన్నవయసులో నా పేరు దేశమంతా తెలిసింది. స్వీట్లు పంచుకోవడానికి ఇంతకంటే ఆనందకరమైన క్షణాలేముంటాయి చెప్పండి అని అడిగాడు. ఆ మాటకు అక్కడున్న వాళ్ళకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. లోకేష్ మాత్రం ఇదేమీ పట్టించుకోకుండా స్వీట్లు పంచుకుంటున్నాడు.

తర్వాత అందరూ హాల్‌లో కూర్చున్నారు. మీడియా ప్రతినిధులు అహో న్యూస్ కీర్తి, టి.వి. 6.5 ప్రతినిధి రాస్కో సాంబా, ఏబిఎఫ్ ఛానెల్ అధిపతి వృధ కృష్ణ, ఏపి 24×5=124 ఛానెల్ ప్రతినిధి వంకరకృష్ణలు చంద్రబాబుతో... సార్, మీరు మళ్ళీ గెలవడం మీకు ఎంత అవసరమో మాకు తెలియదుగాని మాకు మాత్రం అత్యంత అవసరం. మీరు గెలవకపోతే మేం టీవీలలో మా ముఖాలు కూడా చూపించుకోలేం... మేం పసుపు చొక్కాలు వేసుకుని, చేతిలో జెండాలు పట్టుకోలేదన్న మాటేగాని, ఈ ఐదేళ్లు కూడా తెలుగుదేశం పార్టీ కోసం మీ కార్యకర్తలు, నాయకుల కంటే కూడా మేమే ఎక్కువ కష్టపడ్డాం అని చెప్పారు. చంద్రబాబు అందుకు ఇందులో ఎలాంటి సందేహం లేదు. నా కోసం మీరు చాలా వదులుకున్నారు, ఇప్పటిదాకా నా కోసం పోరాడారు. ఈ నెల కూడా ఇంకొంచెం ఎక్కువ పనిచేసి నన్ను గట్టెక్కించే మార్గం చూడండి అని బ్రతిమలాడుకున్నాడు. వృధకృష్ణ వుండి... మీరు పెట్టిన పథకాలు గాని, ఇచ్చిన పసుపు - కుంకుమ వల్ల గాని పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. కాబట్టి మీపై సడెన్‌గా ప్రజలకు అభిమానం వచ్చిపడే సంఘటన ఏదన్నా జరగాలి అని అన్నాడు. వెంటనే బాలాజీ అందుకుని... మొన్న పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై బాంబు దాడులతో ప్రధాని నరేంద్ర మోడీకి అమాంతం ఇమేజ్ పెరిగింది కదా... అలాగన్న మాట అని వివరించాడు. వెంటనే వంకరకృష్ణ అందుకుని... మోడీ ఇమేజ్ పెరగడంలో పాకిస్థాన్ పాత్ర కూడా వుంది... పట్టుబడ్డ పైలట్ అభినందన్‌ను వాళ్ళు ఏదో ముంచుకు పోతున్నట్లు అప్పుడే విడుదల చేసి మోడీకి క్రేజ్ పెంచారు. ఇంకా ఓ వారం పాటు వుంచుకుని, భారత జైళ్లలో వున్న ఓ పాతికమంది ఉగ్రవాదులను విడిపించుకుని ఆపై అభినందన్‌ను విడుదల చేసుంటే మోడీ ప్రతిష్ట మసకబారి వుండేదని నిట్టూర్చాడు. అప్పుడే అహో న్యూస్ ప్రతినిధి కీర్తి సెల్‌ఫోన్‌కు ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ వచ్చింది... అది నరేంద్ర మోడీ అభిమాన సంఘం నుండి వచ్చిన మెసేజ్. 'అభినందన్‌ను పాకిస్థాన్ ఆఘమేఘాల మీద ఎందుకు విడుదల చేసిందో తెలుసా... మోడీ దెబ్బకు జడుసుకుని... కాందహార్ విమానం హైజాక్ సంఘటన లాగే అభినందన్‌ను విడుదల చేయడానికి భారత్‌కు కొన్ని కండిషన్లు పెట్టాలని పాకిస్థాన్ భావించింది. కాని, మోడీ వాళ్ళకు ఆ అవకాశమివ్వలేదు. పాకిస్థాన్ వైపుకు బ్రహ్మోస్ మిస్సైల్స్‌ను గురిపెట్టాడు. 48గంటల్లో అభినందన్‌ను విడుదల చేయకపోతే 49గంటలో పాకిస్థాన్ వుండదని అమెరికా, రష్యా, చైనా దేశాల అధినేతలకు తెలియజేశాడు. దాంతో ఆ దేశాధినేతలు పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై ఒత్తిడి తెచ్చారు. మోడీతో పెట్టుకుంటే నీకు మూడినట్లేనని హెచ్చరించారు. దాంతో ఇమ్రాన్ తోక ముడిచి అభినందన్‌ను విడుదల చేశాడు. జయహో... మోడీజీ.... ఇదీ ఆ మెసేజ్! దీనిని చదువగానే అహో న్యూస్ కీర్తి మెదడులో ఒక మెరుపు మెరిసింది. వెంటనే ఆయన వారితో... చంద్రబాబు గారిని ఈ ఎన్నికల్లో హైప్ చేసే ఐడియా వచ్చింది. రేపు ఉదయం 9గంటలకు మా అహో న్యూస్‌లో దానిని బ్లాస్ట్ చేస్తాను. తర్వాత మా పచ్చ ఛానెల్స్ అన్నీ దానిని కంటిన్యూ చేస్తాయి... రేపు ఉదయం 9గంటలకు మిస్‌కాకండి... మీ అహో న్యూస్ అంటూ అక్కడ నుండి వెళ్లిపోయాడు.

★★★★★

పక్కరోజు ఉదయం 9గంటలైంది. చంద్రబాబుతో సహా తెలుగుదేశం నాయకులంతా టిఫిన్‌లు కానిచ్చేసి టివి ఆన్‌చేసి 'అహో' ఛానెల్ పెట్టుకుని చూస్తున్నారు. అప్పుడే న్యూస్‌లోకి కీర్తి వచ్చాడు. రావడంతోటే... దేశ ప్రజలకే ఒళ్లు పులకించే సంచలన వార్తతో మీ ముందుకొచ్చింది 'అహో న్యూస్'... భారత పైలట్ అభినందన్ విడుదల కావడంలో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కీలకపాత్ర... మోడీ బాంబులకు లొంగని పాకిస్థాన్, బాబు వ్యూహానికి లొంగి అభినందన్‌ను విడుదల చేసింది. ఉగ్ర సంఘటనల తర్వాత భారత్‌తో యుద్ధానికి పాక్ సిద్ధపడింది. మోడీ సై అంటే ఇమ్రాన్ సైసై అన్నాడు. ఎట్టి పరిస్థితులలోనూ పైలట్ అభినందన్‌ను విడిచిపెట్టేది లేదని ఖరాఖండీగా చెప్పాడు. మీరు అణుబాంబులు వేసినా బెదిరేది లేదని సవాల్ విసిరాడు. ఈ దశలో అభినందన్‌ను ఏ విధంగా విడిపించాలనే విషయమై జాతీయ భద్రతా నిపుణులు, ప్రపంచ శాంతి సంఘం నేతలు 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబును సంప్రదించారు. దీనిపై వెంటనే స్పందించిన చంద్రబాబునాయుడు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఫోన్ చేశారు. 48గంటల్లో మా పైలట్ అభినందన్‌ను విడుదల చేయకుంటే 49వ గంటలో పాకిస్థాన్‌లో లక్ష పన్నుల ఐఆర్ 20 - 420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను వదులుతాము... ఇక జీవితాంతం నరక యాతన అనుభవిస్తారని హెచ్చరించాడు. ఇమ్రాన్ వెంటనే బాబ్బాబు... ఆ పని చేయొద్దు. వెంటనే మీ అభినందన్‌ను పంపిస్తున్నాం... అని చెప్పి మన పైలట్‌ను విడుదల చేశాడు. దటీజ్ బాబూ... దటీజ్ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ అహో న్యూస్ కీర్తి ఆ బులిటిన్ ముగించాడు. ఆ వార్త చూస్తూ... చంద్రబాబుతో సహా తెలుగుదేశం నాయకులంతా... ఉగ్రవాదులు బాంబులు, తుపాకులు పట్టుకుంటారని తెలుసు... ఇలా మైకులు, పెన్నులు కూడా పట్టుకుని వుంటారా... అని ఆశ్చర్యపోసాగారు.

---

# మహిళాశక్తిని చాటండి

**నవ్యాంధ్ర రచయిత్రుల పిలుపు**



సత్కారాలందుకున్న ప్రముఖ రచయిత్రులు

మహిళలు మూఢనమ్మకాలను, చాందసభావాలను విడనాడి ప్రగతిపథంలో నడవాలని, మహిళాశక్తిని చాటుతూ దేశాభ్యున్నతికి మరింతగా కృషిచేయాలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) పిలుపునిచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి(జూనియర్) స్మారకభవనంలో ఈ నెల 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 'నరసం' రాష్ట్ర కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళాదినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. మహిళలు చైతన్యవంతులు కావాలంటే విద్య ప్రధానమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద అన్నారు. తొలుత గుర్రాల రమణయ్య ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు తోట సులోచన, వి.లక్ష్మీభవాని నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ప్రముఖ రచయిత్రులు డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, పాతూరి అన్నపూర్ణ, సుభద్రాదేవి, యనమండ్ర లక్ష్మీశైలజ, గూడూరు లక్ష్మి, వి. మాధురిలను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఆదిత్య, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు, భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్, పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధరబాబు, ఆలూరు శిరోమణిశర్మ, మోపూరు పెంచలనరసింహం, అనూరాధా రామకృష్ణ పాల్గొన్నారు.

# సావిత్రిబాయి ఫూలే స్త్రీ శక్తి పురస్కారం ప్రదానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గొలగమూడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్, దక్షిణ భారత క్యాంపస్ నోడల్ అధికారి డా॥ ఎస్.మీరాకు సావిత్రిబాయి ఫూలే స్త్రీ శక్తి పురస్కారం - 2019ను సింహపురి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా అందజేశారు. ఈ పురస్కారాన్ని అంతర్జాతీయ కవి డా॥ పెరుగు రామకృష్ణ, కవయిత్రి సుజనారామం చేతులమీదుగా జ్ఞాపిక, కిరీటం, శాలువతో ఆమెను సత్కరించారు. ఐఐటిటిఎం ప్రొఫెసర్ డాక్టర్ వినోదన్, సామాజికవేత్త కుమార్



స్త్రీ శక్తి పురస్కారాన్నందుకుంటున్న డా॥ ఎస్.మీరా

సింహపురి ఫైన్ ఆర్ట్స్ సిఇఓ ఆరంబాకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

---

'గీతాంజలి'లో 21-22 తేదీల్లో...

# జాతీయస్థాయి సాంకేతిక సదస్సు



జిస్టెక్ ఫెస్ట్-2కె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కోవూరు మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జిస్టెక్ ఫెస్ట్-2కె 19కి సంబంధించిన పోస్టర్‌ని ఈనెల10న కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డా. జి.సుబ్బారావు, సెక్రటరీ ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో, అధ్యాపకబృందంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సిఎస్ఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎం.మదన్‌కుమార్, ఎస్అండ్‌హెచ్ విభాగం డా.సిహెచ్ కల్యాణి, సిఎస్ఇ విభాగాధిపతి శ్రీమతి జాహ్నవి పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్ఎస్ సేవాశిబిరం...

గీతాంజలి కళాశాలలోని ఎన్‌ఎస్ఎస్ సేవావిభాగం ఆధ్వర్యంలో ఇటీవల వారం రోజుల పాటు సేవాశిబిరం నిర్వహించి గంగవరం గ్రామస్తులకు ఉచిత నేత్రపరీక్షలు నిర్వహించారు. నెల్లూరులోని డాక్టర్ ఎల్‌వి ప్రసాద్, వైద్యసిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురికి నేత్రపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మార్చి 10న జరిగిన పల్స్‌పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్స్‌పోలియో కార్యక్రమంలో గీతాజంలి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆ గ్రామంలో చెట్లు నాటి పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాలుష్యనివారణకు తగు సూచనలిచ్చారు. నెల్లూరు పినాకిని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు టి.వి కిషోర్‌కుమార్, ఎన్‌ఎస్ఎస్ విభాగం కార్యక్రమ అధికారి ఎం. మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# కళ్యాణ వైభవం...!

## రఘురామరాజు - రమ్య



నెల్లూరు బొల్లినేని ఆసుపత్రి(కిమ్స్) చీఫ్ కార్డియాలజిస్ట్‌గా అందరికీ సుపరిచితుడైన డాక్టర్ సి.యస్.శ్రీనివాసరాజు - రమాదేవిల కుమారుడు **రఘురామరాజు - రమ్య** (హైదరాబాద్ వాస్తవ్యులు కోడూరు బుల్లి వెంకటరాయుడు - పార్వతిల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 10వ తేదీ హైదరాబాద్‌లోని హోటల్ దస్పల్లా డి కన్వెన్షన్‌లో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

## భరత్ - సాహితి



బీజేపీ నాయకులు కరణం భాస్కర్ - సుభాషిణిల కుమారుడు **శ్రీనివాస భరత్ - సాహితి** (ఏలూరు వాస్తవ్యులు కూరెళ్ళ నాగ వెంకట రామ్‌ప్రసాద్ - సాయిరమాదేవిల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 10వ తేదీ ఏలూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# యువనేతకు... తెలుగు యువత

టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర తీసుకున్న నిర్ణయం పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపుతోంది.



ఆదాలని మర్యాదపూర్వకంగా కలిసిన చందు

నెల్లూరు సరస్వతినగర్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి కుమారుడైన శరత్ చంద్రారెడ్డి తాము సంపాదించిన దాంట్లో కొంతైనా నాలుగు మంచి పనులకు, నలుగురికి మంచి చేసే పనులకు ఖర్చు చేయాలనే ఉద్దేశ్యంతో కొన్నేళ్ళ క్రితమే మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితిని స్థాపించారు. కొడుకు సేవాస్ఫూర్తిని అభినందించి ఆశీర్వదించిన వెంకట నారాయణరెడ్డి కూడా శరత్‌చంద్రారెడ్డి చేసే సేవా కార్యక్రమాలకు కొండంత అండగా నిలిచి సేవా మార్గంలో తన కొడుకును ముందుకు నడిపించాడు. మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ద్వారా నెల్లూరుజిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు జరిగాయి. రక్తదాన శిబిరాలు జరిగాయి. ఒకేరోజు 600మందికి పైగా శరత్‌చంద్రారెడ్డి అభిమానులు రక్తదానం చేసి రికార్డు సృష్టించారు. ముఖ్యంగా పేదపిల్లలు చదివే పాఠశాలల్లో వారికి పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ పంపిణీ చేయడం వంటివి కోకొల్లలుగా జరిగాయి. టెన్త్, ఇంటర్ పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఉచిత రవాణా కల్పించడం, మండుటెండల్లో పరీక్షలు వ్రాసి బయటకొచ్చిన విద్యార్థులకు మజ్జిగ, మంచినీళ్ళు అందించడం వంటివి చేశారు. అనాథాశ్రమాలలో, వృద్ధాశ్రమాలలో అన్నదానం, వస్త్రదానం వంటి సేవలు చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా సంక్రాంతి క్రీడాపోటీలు నిర్వహించారు. పలువురు క్రీడాకారులను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ప్రోత్సహించారు.

ఇలా వయసు చిన్నదైనా మనసు పెద్దది అని నిరూపించుకున్న శరత్‌చంద్రారెడ్డిని జనసేన వంటి పార్టీ కూడా టిక్కెట్ ఇస్తామని, తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించింది. అయితే మారిన పరిస్థితుల దృష్ట్యా మాగుంట శరత్‌చంద్రారెడ్డి ఇటీవల రాజకీయంగా ఓ ముందడుగు వేసి తెలుగుదేశంలో చేరడం, నెల్లూరురూరల్ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం రేయింబవళ్ళు కష్టపడుతుండడం జరిగింది. ఈ నేపథ్యంలోనే తెలుగు యువత అధ్యక్షుడిగా ఆయనను నియమిస్తే పార్టీకి ఎంతో మేలు జరుగుతుందని రవిచంద్ర ఈ పదవికి శరత్‌చంద్రను ఎన్నుకున్నారు. శరత్‌చంద్ర 12వ తేదీ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిసి ఆయన అభినందనలు అందుకున్నాడు.



నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద చందుకు స్వాగతం పలుకుతున్న అభిమానులు






# వైసిపిలోకి వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్



వై.యస్. జగన్ సమక్షంలో వైకాపాలో చేరిన దొంతు శారద దంపతులు

వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద తెలుగు దేశం పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవల వెంకటగిరి వైసిపి అభ్యర్థి మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిపోయారు. ఆమెతో పాటు భర్త బాలకృష్ణ, మరికొందరు కౌన్సిలర్లు వైసిపిలో చేరారు.

దొంతు శారద గత కొంతకాలంగా తెలుగుదేశం నాయకులపై తీవ్ర అసంతృప్తితో వుంది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఆమెకు మధ్య వైరం ముదిరింది. పలు సందర్భాలలో ఎమ్మెల్యే ఆమెను అవమానించాడు. పార్టీలో ఆమెకు విలువలేకుండా చేశాడు. మున్సిపల్ పరిపాలనా వ్యవహారాలలో ఎమ్మెల్యే తల దూర్చేవాడు. దీంతో చాలా కాలంగా ఇద్దరి మధ్య విభేదాలొచ్చాయి. బలహీనవర్గాలకు చెందిన శారదకు పట్టణంలో మంచి పట్టుంది. మంచిపేరు కూడా వుంది. ఎమ్మెల్యే ఆగడాలను పార్టీ అధిష్టానం కట్టడి చేయలేకపోవడం, పార్టీలో ఎదురవుతున్న సంఘటనలతో మనస్థాపం చెందిన ఆమె పార్టీ మారారు.



రూకేష్ - రాధా రాణి

తన గౌరీశంకర్ ఫ్లవర్ డెకరేషన్స్ ద్వారా కొన్ని దశాబ్దాలుగా వందలాది పెళ్ళిళ్ళకు ఆకర్షణీయమైన పూల మండపాలను అందిస్తూ... నెల్లూరుజిల్లా ప్రముఖులు ఏ రాష్ట్రంలో వున్నా తననే పిలిచి పూలమండపం నిర్మింపజేసుకునే స్థాయికి ఎదిగి పూల శీనయ్యగా ఎప్పుడూ అందరికీ అప్పుడుగా వుండే పేట శ్రీనివాసులు - పూర్ణల రెండవ కుమారుడు రూకేష్ - రాధా రాణి (నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం, కోవెరపాళెం వాస్తవ్యులు ముత్యాల శ్రీనివాసులు - సుజాతల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 10వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అనేక మంది రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర నగరాల నుండి కూడా అనేక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై రూకేష్ - రాధారాణిలను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు

# శ్రీ రంగనాథుని బ్రహ్మోత్సవాలు 16 నుంచి

- 21న బంగారు గరుడసేవ
- 23న ఉదయం రథోత్సవం



ఉత్తర శ్రీరంగంగా ప్రఖ్యాతిచెందిన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 16న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ ఇ.ఓ గోపి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, ధర్మకర్తలతో కలసి బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికలను ఈనెల 12న ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈనెల 16 నుంచి 27వ తేది వరకు అంగరంగ వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 17న ధ్వజారోహణం, రాత్రి శేషవాహనోత్సవం నిర్వహిస్తామని, అదేవిధంగా 18వ తేదీ ఉదయం సూర్యప్రభ, రాత్రి హంసవాహనం, 19న ఉదయం సింహవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 20న ఉదయం పల్లకి ఉత్సవం, రాత్రి హనుమంతసేవ, 21న ఉదయం మోహినీ అవతారం, అనంతరం రాత్రి10గంటలకు బంగారు గరుడసేవ ఎంతో కన్నులపండువగా నిర్వహిస్తామని తెలిపారు. 22వ తేది రాత్రి కల్యాణోత్సవం జరుగుతుంది. 23వ తేది ఉదయం వైభవోపేతంగా రంగనాథస్వామి రథోత్సవం నిర్వహిస్తారు. 24వతేది రాత్రి అశ్వ వాహనం, 25వ తేది రాత్రి పుణ్యకోటి విమాన వాహనోత్సవం ఉంటాయి. 26న సాయంత్రం పుష్పయాగం, రాత్రి దవనోత్సవం, అనంతరం ధ్వజావరోహణం జరుగుతాయని, 27వ తేది రాత్రి పెన్నాతీరంలో స్వామివారికి శోభాయమానంగా తెప్పోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తజనం వేలసంఖ్యలో తరలివస్తారు కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

# మా బడికి.. మా వితరణ...

- 3.5 లక్షల వాటర్‌ప్లాంట్ బహుకరణ
- పూర్వ విద్యార్థుల ఔదార్యం




ఆర్.ఓ వాటర్‌ను తాగుతున్న విద్యార్థులు

నెల్లూరు దర్గామిట్టలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 1975 –79 సంవత్సరాల్లో చదువుకున్న పూర్వవిద్యార్థులు తమకు చదువు చెప్పిన ఆ విద్యానిలయంలో మంచినీటికి ఇబ్బంది లేకుండా సుమారు మూడున్నర లక్షల రూపాయల విలువజేసే ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి రాఘవేంద్రశెట్టి మాట్లాడుతూ తామంతా ఇప్పుడు సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉండడానికి కారణమైన పాఠశాలకు వాటర్ ప్లాంట్‌ను బహుకరించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సుపీరియర్ సిస్టర్ స్టీఫెన్, హెడ్మాస్టర్ మరియన్‌తో పాటు పూర్వవిద్యార్థులు రాజశేఖర్ రెడ్డి, డా. ముషాహిద, శ్రీధర్, హంద్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 'నెరసం'..కొత్త కార్యవర్గం

నెల్లూరుజిల్లా రచయితల సంఘానికి ఈనెల 9న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా పాతూరి అన్నపూర్ణ మళ్ళీ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా మెట్టు రామచంద్రప్రసాద్, డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, ఊరుబిండి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, ఉపాధ్యక్షులుగా సింగరాజు శ్రీనివాసకుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, మాటేటి రత్నప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఇనమనమెళ్ళూరి నాగరాజారావు, సహాయకార్యదర్శులుగా హస్తి మోహన్‌రాజు, గజల్ నాగరాజు, డి.టి హరికృష్ణ, కోశాధికారిగా తన్నీరు శశికళ ఎన్నికయ్యారు. అదేవిధంగా, కార్యవర్గసభ్యులుగా షేక్ సత్తార్, గూడూరు లక్ష్మి, విజయలక్ష్మి, షేక్ రసూల్, వి.మాధవరావు, నీలం స్వాతి, సయ్యద్ నజ్మా, ఇసనాక దయాకర్‌రెడ్డి, పోలా జానకి, ములుగు విజయదుర్గ, ములుగు లక్ష్మి, ఘాలి లలితా ప్రవల్లిక, సురభి రాజశేఖర్, రాయప్రోలు సిఎంఆర్ విష్ణుకుమార్, బి. కేశవరామ్ ఎన్నికయ్యారని, ఈ కొత్త కార్యవర్గం రెండేళ్లపాటు తమ విధులను నిర్వహిస్తుందని సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ తెలిపారు.

# ఎవరో కింగ్?

(మొదటి పేజీ తరువాయి)

లోకేష్ చేతుల్లో పార్టీని పెడితే, తర్వాతకాలంలో ఆయన తంటాలు ఆయన పడి పార్టీని లాక్కొస్తాడని బాబు ధీమా! లోకేష్ కోసమే చంద్రబాబు ఈ ఎన్నికలు గెలవాలి. అంతేకాదు, కేంద్రంలో తాను చక్రం తిప్పడానికి కూడా చంద్రబాబుకు ఇక్కడ గెలుపు అవసరం. తెలుగుదేశం ఇప్పుడు ఓడిపోయి జగన్ సీఎం అవడం జరిగితే మరో పదేళ్ళ దాకా ఆ పార్టీ అధికారం మీద ఆశలు వదులుకోవాలి. అప్పటికి చంద్రబాబుకు 80ఏళ్ళు వస్తాయి. ఆ వయసులో ఇక ఆయన రాజకీయ వ్యూహాలు కూడా పని చేయక పోవచ్చు. కాబట్టి ఈ ఎన్నికలు తెలుగుదేశం కంటే, చంద్రబాబు కంటే లోకేష్ రాజకీయ భవిష్యత్‌కు ఎంతో కీలకం కానున్నాయి.

మరి వైసిపి అధినేత జగన్‌కు కూడా ఇది ఫైనల్ మ్యాచే! ఈ ఎన్నికల్లో గెలిస్తేనే ఆయనకు మనుగడ. ఓడిపోతే మరో ఐదేళ్ళు ప్రతిపక్షంలో పార్టీని లాక్కురావడం కష్టమే! జగన్‌లో పట్టుదల వుంది కాబట్టే తాను కష్టపడి వైసిపిని పటిష్టంగా నిలబెట్టాడు. పార్టీ కేడర్‌లో గెలుపుపై ఆశలు నిలబెట్టాడు. ఈ ఎన్నికల్లో వైసిపి గెలిస్తే రాష్ట్ర రాజకీయాల్లో బలీయమైన ప్రాంతీయ శక్తిగా అవతరిస్తుంది. ఓడిపోతే జగన్ రాజకీయ భవిష్యత్ ఇక ఏ మలుపు తిరుగుతుందో చూడాలి!

## మొదటి దశతో ఎవరికి మహర్దశ?

ఏపిలో మొదటి దశలోనే ఎన్నికలు జరుగుతాయని ఎవరూ వూహించలేదు. మహా అంటే ఏప్రిల్ నెలాఖరులో వుంటాయని భావించారు. కాని ఏప్రిల్ 11నే పెట్టేశారు. అభ్యర్థులు నామినేషన్లు వేసి డిక్లేర్ కావడానికి, ఎన్నికల ప్రచారానికి మధ్య 10రోజులే వుంది. ఈ పదిరోజులు చాలా తక్కువ గడువు. ఇంత తక్కువ వ్యవధి రావడం ప్రతిపక్ష వైకాపాకు అడ్వాంటేజ్ కాగా, తెలుగుదేశానికి మాత్రం ఇంత తొందరగా ఎన్నికలు పెట్టడం మింగుడు పడడం లేదు. ఎక్కువ గడువు వుండుంటే చంద్రబాబుకు అన్ని రకాల వ్యవస్థలను మేనేజ్ చేయడానికి అవకాశముండేది.

## మారిన సీన్...

కొన్ని నెలల క్రితం చూస్తే రాష్ట్రంలోని పలు లోక్‌సభ నియోజకవర్గాలలో వైసిపికి సరైన అభ్యర్థులు కనిపించలేదు. టిడిపి తరపున బలమైన అభ్యర్థులు కనిపించారు. కాని, గత నెలరోజుల్లోనే సీన్‌మారింది. టిడిపి నుండి పలు లోక్‌సభ స్థానాలకు పోటీ చేయడానికి అభ్యర్థులు భయపడగా, వైసిపి నుండి మాత్రం లోక్‌సభకు అన్నిచోట్లా గట్టి అభ్యర్థులే సెట్ అయ్యారు. లోక్‌సభ అభ్యర్థుల సామర్థ్యాన్ని బట్టి కూడా ఆయా అసెంబ్లీల అభ్యర్థుల జయాపజయాలు ఆధారపడి ఉంటాయి.

## ముంచిన జిల్లాలే మంచి చేస్తాయా?

2014 ఎన్నికల్లో వైసిపిని ముంచింది గుంటూరు నుండి శ్రీకాకుళం వరకు వున్న ఏడు జిల్లాలే! ఈ జిల్లాల్లో బలంగా వున్న కాపులు ఆనాడు పవన్‌కళ్యాణ్ ప్రభావంతో టిడిపికి మద్దతు పలికారు. దానివల్లనే ఈ జిల్లాల్లో వైసిపికి పెద్దగా సీట్లు రాలేదు. కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల్లో మాత్రమే వైసిపి పైచేయి సాధించగలిగింది. కాని, ఈసారి గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తెలుగుదేశంకు గతంలో వచ్చినన్ని సీట్లు వచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడు జిల్లాల్లో టిడిపి సీట్లకు భారీగానే కోత పడబోతుంది. అయితే కోతపడే సీట్లలో వైసిపి ఎన్ని గెలుచుకుంటుంది, జనసేన ఎన్ని చీల్చుకుంటుందన్నది చూడాలి. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వైసిపి హవా ఏ మాత్రం తగ్గినట్లు కనిపించడం లేదు. ఈ ఆరు జిల్లాల్లో గణనీయంగా సీట్లు పెంచుకుని ఉత్తరం వైపు జిల్లాల్లో పడే లోటును పూడ్చుకోవాలన్నది చంద్రబాబు ఆలోచన. కాని, ఈ ఆరుజిల్లాల్లో తెలుగుదేశంకు ఏమంత అనుకూల వాతావరణం లేదు.

రాష్ట్రంలో ఎండలతో పాటు ఎన్నికలు కూడా వేడెక్కాయి. పోటీలో జనసేన ఉండేటప్పటికీ అధికారం కోసం యుద్ధం మాత్రం టిడిపి – వైసిపిల మధ్యే వుండబోతుంది. మరి 40ఏళ్ల చంద్రబాబు అనుభవం గెలుస్తుందా? 47ఏళ్ల యువనాయకుడి పోరాటాన్ని ప్రజలు ఆదరిస్తారా అన్నది చూద్దాం!

# రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షునిగా జనకుల

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ అధ్యక్షునిగా జనకుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈనెల 12న డిజిపి కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షస్థానానికి జనకుల, జిల్లా పోలీసు అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రసాదరావు పోటీ పడగా, జనకుల శ్రీనివాసరావు 56 ఓట్లతో విజయం సాధించి అధ్యక్షస్థానంలో నిలిచారు. పోలీసు అధికారుల సంఘం నాయకులు ఆయన్ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన జనకుల ప్రస్తుతం డిప్యుటేషన్‌పై సిఐడి విభాగంలో పనిచేస్తున్నారు. ఈ సంఘానికి త్వరలోనే 30 మందితో రాష్ట్ర అడ్‌హాక్ కమిటీని ఎన్నుకోనున్నారు.


# బాబు బ్రాండ్?

(మొదటి పేజీ తరువాయి)

స్వామిభక్తితో జగన్‌పై పెట్టిన కేసులన్నీ కూడా ఒక్కొక్కటిగా వీగిపోతున్నాయి. ఈయన నిర్వాకం తెలిసే మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనను లూప్‌లైన్‌లో పెట్టడం, ఈయనే ఉద్యోగం నుండి స్వచ్ఛందంగా వైదొలగడం జరిగాయి.

గత కొన్ని నెలలుగా ఆయన రాష్ట్రంలో రాజకీయ పర్యటనలు చేస్తున్నారు. ప్రజలకు నీతిసూత్రాలు, ధర్మ బోధనలు చేస్తున్నారు. ఈయన ప్రచారం తీరు చూసి ఏ బీజేపీలోనో లేదంటే జనసేనలోనో చేరుతాడనుకున్నారు. ఆ విధంగా చేరున్నా ఆయన క్రెడిబిలిటీ కొంత అలాగే వుండేది. పోయిపోయి తెలుగుదేశంలో చేరాలనుకున్నాడు. ఆయన పార్టీలో చేరితే అనకాపల్లి ఎంపి టిక్కెట్ ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. అయితే జేడీ లక్ష్మీనారాయణ టీడీపీలో చేరుతున్నాడనగానే జేడీ ముసుగు తొలిగినట్లయ్యింది. ఆయన పక్కా చంద్రబాబు మనిషేనని, సిబిఐ జాయింట్ డైరెక్టర్‌గా తన శాఖ కోసం కంటే చంద్రబాబు కోసమే ఎక్కువగా తపనపడ్డాడనేది అర్థమైపోయింది. ఒక్క రోజులోనే సోషల్ మీడియాలో లక్ష్మీనారాయణ పరువు తీసేసారు. ఆయన మీద నమ్మకం సడలిపోవడంతో నెటిజన్లు మండిపడ్డారు. లక్ష్మీనారాయణ తమ పార్టీలో చేరితే ఎక్కడ తమ గూడుపుఠాణీ బయటపడుతుందోనని తెలుగుదేశం వాళ్ళే పార్టీలో చేరకుండా చివరి నిమిషంలో ఆయనకు బ్రేకేశారు. అయితే లక్ష్మీనారాయణ తెలుగుదేశంలో చేరినా చేరకున్నా అతను బాబు బ్రాండేనని జేమ్స్‌బాండ్ కాదని తేలిపోయింది.

# యువాభినందనలు





అలుపెరుగని సైనికుడు

నిస్వార్థ సేవకుడు

మా యువ నాయకుడు

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి గారు

నెల్లూరు జిల్లా "తెలుగు యువత అధ్యక్షుడిగా"

నియమించబడిన శుభతరుణంలో మా

అభినందనలు.

**మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి**

నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com